మన సమగ్ర

# ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY






| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రాజన్న సిరిసిల్ల | శనివారం | 09.05.2026 | సంపుటి : 01 | సంచిక : 123 | పేజీలు : 12 | వెల : 2/- |
| RAJANNA SIRICILLA | SATURDAY | 09.05.2026 | Volume : 01 | Issue : 123 | Pages : 12 | Cost : 2/- |



## కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా

# మారుస్తా...

● దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి ● 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన ● మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం ● కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపనలు





**కొడంగల్,మే 08 :** దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని మిగతా2లో...

## బెంగాల్ రాజకీయాల్లో

# బిజెపి శకం



● రాష్ట్ర సిఎంగా సువేందు అధికారి
● శాసనసభాపక్ష నేతగా ఏకగ్రవీంగా ఎన్నిక
● అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ
● నేడు సిఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం
● ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు

**కోల్‌కతా,మే 08 :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, మిగతా2లో...



2లో

# తమిళనాడు ఉత్కంఠకు తెర

నేడు సిఎంగా విజయ్ ప్రమాణం
మద్దతుల లేఖలతో గవర్నర్తో మరోమారు భేటీ
ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు గవర్నర్ అనుమతి
11 గంటలకు నెహ్రూ స్టేడియంలో ప్రమాణ కార్యక్రమం
కాంగ్రెస్, లెఫ్ట్ తదితర పార్టీల మద్దతు లేఖలు సమర్పణ
టివికె కూటమి బలం 120కి చేరిక..మద్దతుపై అనేక మెలికలు

## సోనార్ బంగ్లా కోసం కృషి

మహనీయుల కలలు సాకారం చేస్తాం
దశాబ్దాలుగా భయం గుప్పిట్లో బెంగాల్
గో అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం
చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం
సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి దేశాన్ని రక్షస్తాం
కక్షసాధింపు రాజకీయాలకు బిజెపి దూరం
బిజెపి లెజిస్లేచర్ పార్టీ భేటీలో అమిత్ షా స్పష్టీకరణ



2లో

## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలసి పర్యటన
ముంపు ప్రాంతాలను గుర్తించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్,మే 08(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజధానిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలే ట్రాఫిక్, ఉప్పొంగే డ్రైనేజీలు.. తెరుచుకుని ఉండే మ్యాన్ హోల్స్ మిగతా2లో...

## తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం

● కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు విమర్శలు మానితే మంచిది
● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



2లో



2లో

## కొడంగల్‌పైనే కాదు.. రాష్ట్రంపై శ్రద్ద పెట్టాలి

బిఆర్ఎస్ ప్రాజెక్టులతో డబ్బులు వృధా చేసింది
ఎక్కడా కాల్వలు నిర్మించి నీళ్లు పారించలేదు
టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన

# శాంతిభద్రతలు



- నరగంలో వరుస హత్యలు ఆందోళనకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్,మే 08 :** రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, మిగతా2లో...

## మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

● మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి ● స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది ● అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం ● ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయండి ● జనంలో విశ్వసనీయత కల్పించేలా కార్యాచరణ ● ఉన్న నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ ● కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్,మే 08 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను మిగతా2లో...

## ప్రధాని పర్యటన తరవాత

# రాజకీయ మార్పులు

## - బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు



**హైదరాబాద్,మే 08 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తు న్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు

మిగతా2లో...




## సచివాలయంపై డ్రోన్ కలకలం

### సోషల్ మీడియా ప్రచారంపై సర్కార్ సీరియస్

**అమరావతి,మే 08 :** రాజధాని అమరా వతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కలెక్టర్ల సదస్సు జరుగుతున్న సమయంలో.. సచివాలయంపై డ్రోన్ కలకలం అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం మిగతా2లో...

## మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి – ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశర చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈస్ట్–టు–వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి –గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు.

## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

(మొదటి పేజీ తరువాయి)

వెరసి వాహనదారులకు నరకప్రాయంగా ఉంటుంది. ఇక కృష్ణానగర్ నగర్ గురించి ఎంత చెప్పినా తక్కువే... చిన్నపాటి వర్షానికే రోడ్ల మీద డ్రైనేజీ ఉప్పొంగి ప్రవహిస్తూ వరదను తలపిస్తుంటుంది. ఈ క్రమంలో కృష్ణానగర్ వరద సమస్యపై హైడ్రా ఫోకస్ పెట్టింది. కృష్ణానగర్ వరద సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కృష్ణానగర్‌లో కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం చేసింది హైడ్రా. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి పనులను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల వరద కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు అధికారులు. నాలాల్లో డీసిల్టింగ్ పనుల్లో జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా భాగస్వామ్యం వహిస్తోంది. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వచ్చే మట్టి కారణంగా సమస్య తీవ్రత పెరుగుతోందని అంటున్నారు అధికారులు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు చర్యలు చేపట్టామని అన్నారు. కృష్ణానగర్ వరద ముప్పు కు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యామ్నాయ వరద కాలువ నిర్మాణంపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని..8 నుంచి 9 అడుగుల లోతున్న కాలువల్లో 6 నుంచి 7 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని తెలిపారు అధికారులు. అవసరమైతే స్లాబులు తొలగించి పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తామని స్పష్టం చేశారు కమిషనర్ రంగనాథ్. నాలాపై నిర్మించిన ఒకటి రెండు ఇళ్లను గుర్తించామని... తప్పనిసరి పరిస్థితి వస్తేనే తొలగింపు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇళ్ల ఖాళీ చేయించటానికి ముందు నోటీసులు, తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు కమిషనర్ రంగనాథ్.

## బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

(మొదటి పేజీ తరువాయి)

పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపూర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006–09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయి (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపూర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్–2 ఈయనేనని అంతా అనుకున్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

## తమిళనాడు ఉత్కంఠకు తెర

**చెన్నై,మే 08 :**తమిళనాట ఉత్కంఠకు తెరపడింది. టివికె అధినేత విజయ్ నేడు సిఎంగా ప్రమాణం చేయబోతున్నారు. వివిధ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు సమర్పించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరు గుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నై లోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మే 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది. ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరుతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరడానికి అడుగులు పడు తున్నా.. మిత్రపక్షాల షరతులు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు వీసీకే తమ మద్దతుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశాయి. విజయ్ ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వామపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. టీవీకే ప్రభుత్వానికి తాము కేవలం బయటి నుంచే మద్దతు ఇస్తామని.. కేబినెట్‌లో చేరే ఉద్దేశం లేదని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. ప్రస్తుత రాజకీయ అనిశ్చితిని తొలగించి, ఒక సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న ఉద్దేశంతోనే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఇక, టీవీకేకు ముందుగానే మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్‌కు ఒక కీలకమైన షరతు విధించింది. భవిష్యత్తులో టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ మతతత్వ పార్టీలతో చేతులు కలపకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ షరతుకు లోబడి ఉంటేనే.. తమ 5 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటుందని హైకమాండ్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకమైన 2 స్థానాలు కలిగిన విదుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ తనదైన వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. వచ్చే ఉపఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని ఆయన షరతు పెట్టారు. తిరుమావళవన్ స్వయంగా తిరుచ్చి ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ స్థానం ఇస్తేనే టీవీకేకు మద్దతుపై తుది సంతకం చేసే అవకాశం ఉంది.వామపక్షాలు కేబినెట్‌లో చేరక పోవడం వల్ల విజయ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలకే ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, తిరుమావళవన్ కోరుతున్న 'తిరుచ్చి ఈస్ట్' స్థానం విషయంలో విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## సోనార్ బంగ్లా కోసం కృషి

**కోల్‌కతా,మే 08:** సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా కళ్లెం వేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ బీజేపీ శానససభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బీజేపీ కార్యకర్తలందరి బాధ్యత అన్నారు. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు. బెంగాల్ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎన్నిక పక్రియను పర్యవేక్షిచేందుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్‌షా శుక్రవారంనాడు హాజరయ్యారు. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సువేందు అధికారిని బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. ఈనెల 9వ తేదీన కోల్‌కతాలోని బ్రిగేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... కమ్యూనిస్ట్ పాలన నుంచి బెంగాల్‌లో భయం, హింసాత్మక వాతావరణం ఉందని, ఇది ఆ తర్వాత తీవ్రంగా మారిందని అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో బెంగాల్ ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని అన్నారు. ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా 'సోనార్ బంగ్లా' లక్ష్యంతో ముందుకు సాగుతామని చెప్పారు.

బెంగాల్ భయం రహిత సమాజం దిశగా వెళ్తుందని అన్నారు. గత 5 దశాబ్దాలుగా బెంగాల్ శాంతిభద్రతలు, ప్రజాస్వామ్యం,
ఆర్థిక వ్యవస్థ పరంగా తీవ్రమైన ప్రతికూల రాజకీయాలను చూసిందని.. బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఇప్పుడు బీజేపీ బాధ్యత అని అన్నారు. బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేస్తూ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శ్రీ అరబిందో, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కోరుకున్న బెంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని అన్నారు.

## తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం

**హైదరాబాద్,మే 08:**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు. గవర్నర్ చర్యలను బిజెపికి అంటగట్టి విమర్శించడం మానుకోవాలన్నారు.

## కొడంగల్‌పైనే కాదు..రాష్ట్రంపై శ్రద్ధ పెట్టాలి

**హైదరాబాద్,మే 08:**రిజర్వాయర్ల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేసినా రైతులకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వలేకపోయారని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రిజర్వాయర్లు నిర్మించడం మాత్రమే సరిపోదని, నీళ్లు పొలాల వరకు చేరాలంటే కాలువలు కూడా నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన ప్రయోజనం కలగలేదని విమర్శించారు. టీఆర్ఎస్ నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి తగిన న్యాయం జరగలేదని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు 12 సీట్లు ఇచ్చినా అభివృద్ధి పనులు కనిపించలేదని అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ప్రకటించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకే తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని పేర్కొన్న కవిత.. త్వరలో మరో నీటి ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆ ఉద్యమానికి లక్ష్మీదేవిపల్లి వేదిక కావడం గర్వంగా ఉందని చెప్పారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ– వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సచివాలయంపై డ్రోన్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత సీరియస్‌గా తీసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా కీలకమైన సమయంలో ఇలాంటి పుకార్లు పుట్టించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. విజయవాడలోని సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆకాశంలో కనిపించిన ఓ విమానాన్ని.. డ్రోన్‌గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు కలకలం రేపాయి. కలెక్టర్ల సదస్సు జరుగుతున్న వేళ భద్రతా వైఫల్యం జరిగిందంటూ విమర్శలు చేసే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. ఢిల్లీ నుంచి విజయవాడ వస్తున్న ౦ఎ2903 విమానాన్ని చూపించి.. అది డ్రోన్ అంటూ తప్పుడు ప్రచారం చేశారని పోలీసులు నిర్ధారించారు. సదరు విమానం నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ల్యాండింగ్ కోసం ఆ మార్గంలో ప్రయాణించిందని అధికారులు స్పష్టం చేశారు.

# అకాల వర్షం.. అన్నదాతకు కన్నీటి కష్టం!

- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దైన మొక్కజొన్న
- రెండుసార్లు ధర్నా చేసినా కదలని యంత్రాంగం
- పైరవీకారులకే ప్రాధాన్యం.. సామాన్య రైతుకు చుక్కెదురు
- బస్తాకు రూ.26 అదనపు భారం.. అయినా తప్పని నిరీక్షణ
- పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు: రైతుల ఆగ్రహం







**చెన్నారావుపేట మే 8 (ప్రజావాణి):**మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల్లో అధికారుల జాప్యం, పాలకుల నిర్లక్ష్యం అన్నదాతను నిట్టనిలువునా ముంచాయి. గురువారం కురిసిన అకాల వర్షం మొక్కజొన్న రైతుల పాలిట శాపంగా మారింది. నెల రోజులుగా కళ్లాల వద్దే కాపలా కాస్తున్నా, అధికారులు కనికరించకపోవడంతో వేల క్వింటాళ్ల మొక్కజొన్న తడిసి ముద్దయ్యింది. రెండుసార్లు ధర్నా చేసినా, అధికారులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయని రైతులు మండిపడుతున్నారు.

**పైరవీలకే కాంటా.. సామాన్యుడికి వాత!**

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత కరువైందని రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారు సొసైటీ సిబ్బంది కి ముడుపులు చెల్లిస్తే వారి పంటను కేవలం రెండు రోజుల్లోనే తూకం వేసి గోదాములకు తరలిస్తున్నారు. మూడు రోజుల క్రితం వచ్చిన ఈర్య తండాకు గ్రామానికి చెందిన వారి ధాన్యాన్ని వెంటనే కాంటా వేశారని, కానీ నెల రోజులుగా వేచి చూస్తున్న తమను పట్టించుకోవడం లేదని జల్లి గ్రామానికి చెందిన నూనె రమ అనే మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తన 300 బస్తాల మొక్కజొన్న కోసం బస్తాకు రూ.26 చొప్పున ఖర్చు చేసి నింపి ఉంచినా కాంటా చేయకపోవడంతో ఫలితం లేకుండా పోయింది.

**అధికారుల లెక్కల్లో గందరగోళం**

సొసైటీ కేంద్రంలో నిల్వ ఉన్న 10 వేల బస్తాలకు సంబంధించి అధికారులు సరైన లెక్కలు చెప్పడం లేదని రైతులు ధ్వజమెత్తారు. ప్రభుత్వం గోనె సంచులు ఇవ్వకపోవడంతో రైతులు తమ సొంత ఖర్చులతో సంచులు కొనుగోలు చేసి, కూలీలకు డబ్బులిచ్చి సుమారు 20 వేల బస్తాలు నింపి సిద్ధంగా ఉంచారు. అయినప్పటికీ కాంటాలు వేయడంలో కావాలనే జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కళ్లాల్లో ఇంకా నింపని మొక్కజొన్న సుమారు 40 వేల బస్తాల వరకు ఉంటుందని, ఇప్పుడు వర్షానికి అది కూడా పాడైపోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

**ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకే విక్రయం**

ప్రభుత్వ కేంద్రాల్లో జాప్యం భరించలేక, వర్షానికి పంట పాడవుతుందన్న భయంతో కొందరు రైతులు గత్యంతరం లేక తమ పంటను ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. మద్దతు ధర దక్కక, మిల్లు యజమానులకు రూ. 2,100లకే విక్రయిస్తూ నష్టపోతున్నారు.తడిసిన మొక్కజొన్నకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, మద్దతు ధర ప్రకటించి తక్షణమే కొనుగోలు చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు విఫలమైన చోట జిల్లా కలెక్టర్ నేరుగా స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## మోదీ సభకు శాయంపేట మండలం నుంచి భారీ ఎత్తున తరలి రావాలి బీజేపీ నేత లాడే శివ



**ప్రజావాణి శాయంపేట :**ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు శాయంపేట మండల కేంద్రం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని బీజేపీ నాయకుడు లాడే శివ కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ఎన్నికైన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందన్నారు.శాయంపేట మండలంలోని బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, తెలంగాణలో కూడా బీజేపీకి ప్రజాదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. సభ విజయవంతం ద్వారా తెలంగాణ ప్రజల మద్దతు మరోసారి చాటాలని లాడే శివ పిలుపునిచ్చారు.

## మృతుని కుటుంబానికి పద్మశాలి సంఘం తరుపున ఆర్థిక సహాయం అందజేత



**ప్రజావాణి శాయంపేట :**మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పద్మశాలీ కులస్తుడు, పరపతి సంఘం సభ్యుడు కందగట్ల నరహరి (కనకయ్య) మృతి చెందగా మృతుని కుటుంబానికి పద్మశాలి పరపతి సంఘం తరఫున 5000 రూపాయలు ఆర్థిక సాహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కందగట్ల పరమాత్మ కార్యవర్గ సభ్యులు గుర్రం రమేష్, కందగట్ల ప్రవీణ్ కుమార్, బంక జోగయ్య కుల సంఘం కందగట్ల సూర్యనారాయణ, ప్రకాష్,రాజమొగిలి, నవీన్, కుమారస్వామి,హరికృష్ణ,తిరుపతి,శ్రీనాథ్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యశోద ఆసుపత్రిలో 'హైపర్ సైట్' విప్లవం

- క్యాన్సర్ చికిత్సలో సరికొత్త మైలురాయి
- యశోద ఆసుపత్రి ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సందీప్ కుమార్ తుల



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, మే 08:**క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా వైద్య రంగంలో వస్తున్న అధునాతన సాంకేతికతను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సందీప్ కుమార్ తుల పేర్కొన్నారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు, అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఒకప్పుడు క్యాన్సర్ అంటే మరణశాసనంగా భావించేవారని, అయితే ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతతో నాలుగో దశ క్యాన్సర్ రోగులు కూడా ఏళ్ల తరబడి సాధారణ జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు.యశోద ఆసుపత్రిలో నూతనంగా ప్రవేశపెట్టిన "హైపర్ సైట్" అడ్వాన్స్‌డ్ రేడియేషన్ మెషిన్ గురించి వివరిస్తూ, ఈ పరికరం ద్వారా ట్యూమర్‌ను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించవచ్చని చెప్పారు. దీని ద్వారా రేడియేషన్ ప్రభావం గుండె, ఊపిరితిత్తులు వంటి సున్నితమైన అవయవాలపై పడకుండా కేవలం క్యాన్సర్ కణాలపైనే చికిత్స అందించవచ్చని వివరించారు.క్యాన్సర్ అనేది ఒక్క వ్యాధి కాదని, ఇది 100కు పైగా రకాల వ్యాధుల సమూహమని డాక్టర్ సందీప్ తెలిపారు. ముఖ్యంగా రొమ్ము, ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణాశయం, గర్భాశయ ముఖద్వారం, ప్రోస్టేట్, రక్తం మరియు చర్మ క్యాన్సర్లు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు.శరీరంలో నోటి పూత, గొంతు నొప్పి, జీర్ణక్రియలో మార్పులు వంటి లక్షణాలు రెండు వారాలకు మించి కొనసాగితే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పైల్స్ వంటి సాధారణ సమస్యలుగా భావించి చాలా మంది క్యాన్సర్‌ను చివరి దశ వరకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత కాలంలో ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, ధూమపానం, మద్యపానం వంటి కారణాలు క్యాన్సర్‌కు ప్రధాన కారకాలుగా మారుతున్నాయని హెచ్చరించారు. హోటళ్లలో వాడిన నూనెను మళ్లీ ఉపయోగించడం, ప్రాసెస్డ్ ఫుడ్స్ అధికంగా తీసుకోవడం వల్ల కూడా క్యాన్సర్ ముప్పు పెరుగుతోందన్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, ఆరోగ్యకర జీవనశైలిని పాటించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని సూచించారు.యశోద ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన "హైపర్ సైట్" అడ్వాన్స్‌డ్ రేడియేషన్ మెషిన్ ద్వారా క్యాన్సర్ రోగులకు మరింత సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ బాధితులు వ్యాధి దశను నిర్ధారించుకుని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఆధునిక వైద్యం పొందాలని సూచించారు.అనంతరం పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు డాక్టర్ సందీప్ కుమార్ తుల సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షల కి మట్టి నమూనా సేకరణ పై అవగాహన



**గరిడేపల్లి ప్రజావాణి మే 8:** కే.వి.కే-గడ్డిపల్లి శాస్త్రవేత్త అరిగెల కిరణ్ గరిడేపల్లి మండలంలోని గారకుంట తండా గ్రామంలో శుక్రవారం నాడు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం-గడ్డిపల్లి మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ భూసార పరీక్ష కు మట్టి నమూనా సేకరించే విధానం పై అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ నేల యొక్క భూసారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలి అని, తద్వారా ఎరువుల వాడకంలో అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అదిక మరియు సుస్థిర దిగుబడులు పొందవచ్చని.భూసార పరీక్షలు చేయడం ద్వారా పోషకాల పరిమాణం కాకుండా భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చుని, రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించి కే.వి.కే-గడ్డిపల్లి కి పంపించినట్లు అయితే రైతులకు భూసార పరీక్ష చేసి భూఆరోగ్య పత్రాలు అందజేస్తామని తెలిపారు. మట్టి నమూనాలు సేకరించే విధానానికి 7893989055 నెంబర్ కి కాల్ చేసి తెలుసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నరేదర్ నాయక్, వెంకట్రామ్, పుల్లయ్య, సైదులు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి...

- రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి.





**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08:**ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి అన్నారు. శుక్ర వారం రోజు తన ఛాంబర్ లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ మొదటి , సంవత్సరం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని అన్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 3936 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవు తున్నారని , ద్వితీయ సంవత్సరంలో 1691మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. మొత్తం 5627 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అందుకు 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వ హించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వ హించాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపులో అత్యంత భద్రత తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయాను కూలంగా పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని , నిరంతరం పరీక్ష కేంద్రాలలో విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసు కోవాలని , మున్సిపాలిటీ అధికారులను కోరారు. గ్రామ పంచాయతీ పరిధిలో , ఎండలు ఎక్కువగా ఉన్నందున పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో శానిటేషన్ , ఫస్ట్ ఎయిడ్ కిట్లను , ఓఆర్ఎస్ పాకెట్స్ వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని , ప్రశ్నాపత్రాల కవరు సీలు తీయటం , జవాబు పత్రాలను కవరులో ఉంచి సీలు వేయడం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.మొబైల్ ఫోన్లను అనుమతించడం జరగదన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని , పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలన్నారు.ఫ్లయింగ్ స్క్వాడ్ , సిట్టింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ లక్ష్మీ నారాయణ , ఇంటర్మీడియట్ జిల్లా అధికారి సురేష్ , జిల్లా ట్రెజరీ ఆఫీసర్ సంపూర్ణ , ఆర్టీసీ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మద్దా నాగేశ్వరరావు గారి పార్థివదేహానికి నివాళులర్పించిన హుజూర్నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు



**గరిడేపల్లి ప్రజావాణి మే 8:**గరిడేపల్లి మండలం కొండయ్య గూడెం గ్రామ మాజీ ఉపసర్పంచ్ మద్దా భాస్కర్ తండ్రి మద్దా నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందగా వారి పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన హుజూర్నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘుఈ యొక్క కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గుగూలోతు కృష్ణ నాయక్ మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి మాజీ పిఎసిఎస్ చైర్మన్ వీరారెడ్డి శంభిరెడ్డి మండల సోషల్ మీడియా కన్వీనర్ వట్టే యల్లయ్య యాదవ్ మండల మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు అత్తి మధువెంకట్ రెడ్డి ఉపేందర్ రెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారుద

# జర్నలిస్టుల ఐక్యతకు కొత్త వేదిక..

- ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యత్వాలకు ఆహ్వానం



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న జర్నలిస్టులు, డిజిటల్ మీడియా ప్రతినిధులు, యూట్యూబర్లు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లందరికీ ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఐ. ప్రభాకర్ తెలిపారు. ఇటీవల ఘనంగా నిర్వహించిన ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవానికి మీడియా వర్గాల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.ప్రెస్ క్లబ్‌ను జర్నలిస్టుల హక్కులు, ఐక్యత, సంక్షేమానికి అంకితమైన వేదికగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రారంభ దశలో 10 మంది సభ్యులతో తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పుడు పూర్తి స్థాయి కమిటీ పునర్వ్యవస్థీకరణ కోసం జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి మీడియా ప్రతినిధి ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రెస్ క్లబ్ బలోపేతానికి భాగస్వాములు కావాలని కోరారు.జర్నలిస్టులు, ప్రజలు ప్రెస్ మీట్లు నిర్వహించు కునేందుకు ఆధునిక సదుపాయాలతో ప్రెస్ క్లబ్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఫ్రీ వైఫై, మినరల్ వాటర్, ఏసీ -- నాన్ ఏసీ హాళ్లు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాల నిఘా వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. సాధారణ ప్రెస్ మీట్‌లకు రూ.600, కమర్షియల్ ప్రెస్ మీట్‌లకు రూ.1000 రుసుము నిర్ణయించినట్లు ఐ. ప్రభాకర్ తెలిపారు.

# రైతులు,మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే జీఎస్సార్..







**రేగొండ మే 8 (ప్రజావాణి):-** భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో కొడవటంచ గ్రామంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజా పాలన బి ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పశు సంవర్ధక శాఖ, మత్స్య శాఖ మరియు నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో జరిగిన పశుసంవర్ధక చికిత్స మరియు అవగాహన శిబిరం, రైతు వారోత్సవం, రైతు వారం నీటిపారుదల శాఖ కార్యక్రమాలలో భూపాలపల్లి శాసనసభ్యులు లి.గండ్ర సత్యనారాయణ రావు.పాల్గొని ప్రారంభించినారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే. మాట్లాడుతూ రైతులు,పాడి పశువుల పెంపకదారులు మరియు మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.పాడి పశువులలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స, మేలు జాతి దూడల పెంపకం కోసం లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భాదారణ చేయించుకోవాలని రైతులకు సూచించారు.అలాగే రైతు వారోత్సవం కార్యక్రమంలో భాగంగా చెరువుల్లో కలుపు నివారణ, చేపల వ్యాధుల నిర్వహణ,చేపల ఉత్పత్తి పెంపు చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతు వారం కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల గేట్ల నిర్వహణ, ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు, కాలువలలో పూడిక తొలగింపు,జమ్ము మరియు కంపచెట్ల తొలగింపు వంటి పనులను సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్. +..కిష్టయ్య..కొడవటంచ ఆలయ చైర్మన్..నాయినేని సంపత్ రావు..ప్రజాప్రతినిధులు,రైతులు, మత్స్యకారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బట్టర్ మిల్క్ ప్యాకెట్లు అందజేత

- ఉపాధి హామీ కూలీలకు బట్టర్ మిల్క్ ప్యాకెట్లు అందజేస్తున్న సర్పంచ్ రామాంజిగౌడ్ ఎంపీడీవో సరోజ ఎంపీఓ ఇబ్రహీం



**గరిడేపల్లి ప్రజావాణి మే 8:**ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ కోరారు రాయిని గూడెం లో కాల్వపల్లి మేజర్ లోఉపాధి హామీ పనులను రామాంజి గౌడ్ ప్రారంభించి మాట్లాడారు అనంతరం కూలీలకు బట్టర్ మిల్క్ ప్యాకెట్లు అందజేశారు వారితో మీరు ఉదయం పూట తొందరగా వచ్చి ఎండాకాక ముందే ఇండ్లకు పోవలెను ఇప్పుడు ఉన్న ఎండలను దృష్టిలో పెట్టుకుని దయచేసి మీరందరూ గమనించి ఈ విషయాన్ని సద్వినియోగం చేసుకోగలరని నా మనవి వారికి ఉదయం పూట వాటర్ వాళ్లకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి సునీత మేటు శ్రీకాంత్ గ్రామ పంచాయతీ సిబ్బంది సైదులు విశాఖ కోల వెంకటేశ్వర్లు మేకపోతుల వీరస్వామి గుండు రాంబాబు గుండు రాములమ్మ చిలక సోమమ్మ గుండు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

# జనగణన-2027 స్వీయ గణన అవగాహన ర్యాలీ...

- జెండా ఊపి ప్రారంభించిన అదనపు కలెక్టర్ భాస్కరరావు.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08:**యాదాద్రి భువనగిరి జిల్లాలో జనగణన-2027,స్వీయ గణనకు సంబంధించి అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ భాస్కరరావు ప్రారంభించారు. శుక్రవారం రోజు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించ బడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి అత్యంత కీలక మైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి కుటుంబం సరైన సమాచారం అందించి జనగణన , స్వీయ గణన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్డీవో కృష్ణారెడ్డి,సీపీఓ కార్యాలయ సిబ్బంది,సెన్సస్ అధికారులు,ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన సర్పంచ్



- గుడిసె గట్టయ్య యాదవ్.

**కన్నాల. మన ప్రజావాణి.** మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన పెండం శారద సత్యనారాయణ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయడం జరిగిందని కన్నాల గ్రామ సర్పంచ్ గుడిసెగట్టయ్య అన్నారు ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతున్న శుభత రుణం ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దుల శ్రీధర్ బాబు కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్గా హామీ మేరకు రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ సొంతింటి కల నెరవేర్చే హామీ మేరకు పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నెరవేరుతుంది కన్నాల సర్పంచ్ మాట్లాడుతూ శ్రీధర్ బాబు ఆరు హామీలను భాగంగా పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు కన్నాల గ్రామానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి సయేందర్ రె డ్డి సురేందర్ రెడ్డి గారి దివ్య సంజీవరెడ్డి తోకల మల్లేష్ సందీప్ సమ్మయ్యలు పాల్గొన్నారు

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల పథకం రైతు వారం

- కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం మే 08:**పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స మరియు దూడల ప్రదర్శన కార్యక్రమం 08-05-2026 న దామరచర్ల పశువుల ఆసుపత్రిలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పాడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు.పాడి పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమని, ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో దామరచర్ల సర్పంచ్ బంటు రేణుక కొండ లక్ష్మణ్ గౌడ్, బారెడ్డి గోవింద రెడ్డి, దారగాని సురేష్, పూర్ణ చంద్ర నాయుడు పశువైద్య అధికారులు, పాడి రైతులు కరణం సైదిరెడ్డి మరియు షేక్ జానీ స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సమగ్ర పశు వైద్య చికిత్స మరియు అవగాహన సదస్సు





**గరిడేపల్లి ప్రజావాణి మే 8** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సమగ్ర పశు వైద్య చికిత్స మరియు అవగాహన సదస్సు ముఖ్య అతిథిగా కల్మలచెరువు గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను ప్రారంభించడం జరిగిందిఇట్టి కార్యక్రమంలో కల్మలచెరువు, పొనుగోడు గడ్డిపల్లి గ్రామాల పశు వైద్య అధికారులు సురేష్ బిందు శ్రీకాంత్ పాడి పరిశ్రమ రైతులకు వేసవికాలంలో వచ్చే వ్యాధులు వాటికి నివారణ చర్యలు పశుగ్రాసం మొదలైనటువంటి విషయాల గురించి రైతులకు మెలకువలు అవగాహన కల్పించడం జరిగింది వివిధ గ్రామాల పాడి పరిశ్రమ రైతులు,ఉమ్మడి కృష్ణారెడ్డి దాసరి లక్ష్మయ్య పోలబోయిన ధన మూర్తి గట్టిగుప్పుల వెంకటరమణా రెడ్డి మూలగుండ్ల సైదిరెడ్డి దాసరి శ్రీనివాస్ అమరవరపు బాలయ్య నరేందర్, పున్న రాములు బొత్తల పాలెం గానుగుబండ సీట్ల తండా గ్రామాల రైతులందరూ తదితరులు పాల్గొనడం జరిగింది

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన...

- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన భువనగిరి ఎమ్మెల్యే దంపతులు.
- సుమారు 25 కంపెనీల ద్వారా 3500 ఉద్యోగ అవకాశాలు.
- కుంభం పౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి.






**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08:**యాదాద్రి భువనగిరి జిల్లా యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , కుంభం ఫౌండేషన్ ఛైర్మెన్ కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ జాబ్ మేళా ఈనెల 8 , 9 , 10 తేదీలలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం రోజు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్ మేళాను ఘనంగా ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రముఖ 1ఎం1బి సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపు 3500 ఉద్యోగ అవకాశాలను అందించ నున్నాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుప్పం , కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ ప్రాంతాల్లో విజయవంతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన 1ఎం1బి సంస్థ ఇప్పుడు తెలంగాణ యువత కోసం రాష్ట్రంలో మొట్ట మొదటిసారి యాదాద్రి భువనగిరి జిల్లా వేదికగా ఎంచుకోవడం విశేషంగా నిలిచింది. ఇంటర్ , డిగ్రీ , బీటెక్ , ఐటీఐ , డిప్లొమా , ఇతర అర్హతలు కలిగిన యువతకు ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రైవేట్ రంగం లోని ప్రముఖ కంపెనీలు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. జాబ్ మేళా మొదటి రెండు రోజులు అయిన మే 8 , 9 తేదీలలో అభ్యర్థుల స్క్రీనింగ్ , సర్టిఫికెట్ల పరిశీలన , టోకెన్ కేటాయింపు ప్రక్రియ నిర్వ హించబడుతుంది. అనంతరం మే 10వ తేదీన ప్రధాన ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. అలాగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతకు ప్రత్యేకంగా గైడెన్స్ , కమ్యూనికేషన్ స్కిల్స్ , ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో , ప్రముఖ కంపెనీలే జిల్లా కేంద్రానికి వచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం శుభ పరిణామమన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళా వేలాది మందికి ఉపాధి మార్గాన్ని చూపుతుందని తెలిపారు. గత కొద్ది రోజులుగా ఈ కార్యక్రమం విజయవంతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వాలంటీర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మే 10వ తేదీన నిర్వహించనున్న ప్రధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి యువత , ప్రజలు , నిర్వాహకులు అందరూ సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాకు భారీ సంఖ్యలో యువత హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుంభం ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేస్ చిస్తి , మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి , వైస్ చైర్మన్ మంజుల , పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ వార్డు సభ్యులు , భువనగిరి పట్టణ , మండల , గ్రామాల ప్రజా ప్రతినిధులు , సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు , మహిళా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

- పశుసంరక్షణతో రైతులకు అదనపు ఆదాయం
- సమగ్ర పశు సేవలు -- పశు చికిత్స మరియు అవగాహన శిబిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**మన సమగ్ర ప్రజావాణి మే 08సంగారెడ్డి జిల్లా ప్రతినిధి :** పాడి పరిశ్రమ రైతులకు స్థిరమైన అదనపు ఆదాయ వనరుగా మారాలని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చౌటుకూరు మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ మరియు పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర పశు సేవలు, పశు చికిత్స మరియు అవగాహన శిబిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పశుసంపద అధికంగా ఉండటం ఆనందంగా ఉందని, పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో పశుసంపద కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.పశువుల ఆరోగ్య పరిరక్షణ, డివార్మింగ్, టీకాలు, పశుగ్రాస నిర్వహణ, సంతానోత్పత్తి సేవలు, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు మరింత చేరువై సేవలు అందించాలని సూచించారు.పశువుల చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం అవసరమైన టేబుళ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, సంబంధిత అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారి వసంత కుమారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు తమ సమస్యలను అక్కడ తెలియజేసి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా పలువురు రైతులకు సబ్సిడీపై పశు గ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. శిబిరంలో పశువులకు డివార్మింగ్ మందులు వేయడంతో పాటు పశు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, గ్రామ సర్పంచ్, తహసిల్దార్, రైతులు, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జన నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్ 58వ జన్మదిన వేడుకలు

- దేశిని కోటి ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు మహా అన్నదాన కార్యక్రమం
- పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ కేకు కట్ చేసి పండ్లు పంపిణీ







**జమ్మికుంట మే 8 (ప్రజావాణి)**జమ్మికుంట పట్టణంలోని పొన్నం ప్రభాకర్ అన్న 58వ జన్మదిన సందర్భంగా దేశిని కోటి ఆధ్వర్యంలో జమ్మికుంటలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది అలాగే జమ్మికుంట గాంధీ చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకర రమేష్ ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ అన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. దేశిని కోటి సుంకరి రమేష్ మాట్లాడుతూ నాడు ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ అన్న తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంట్లో తెలంగాణ బిల్లు పెడుతున్న సందర్భంలో ఆంధ్ర నాయకులు ప్రభాకర్ అన్న పై పెప్పర్ స్ప్రే దాడి చేసినప్పటికీ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రం బిల్లును పోరాటం చేశారు ఇప్పుడు బీసీ సంక్షేమ శాఖ మంత్రి అయినప్పటినుండి బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల ఎమ్మెల్యేల సహాయ సహకారాలు తీసుకొని అసెంబ్లీలో తీర్మానం చేసి ఎంతో కృషి చేశారు ఢిల్లీలో సైతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు బీసీలకు రిజర్వేషన్ రావాలని రాజకీయంగా బీసీ నాయకత్వం బలపడాలని బీసీ విద్యార్థులకు సీట్లు రావాలని బిసి యువకులకు ఉద్యోగాలు రావాలని బీసీ రిజర్వేషన్ పెంచాలని అనేకమైన కార్యక్రమాలు తీసుకున్నారు మరి అలాగే ఈ జమ్మికుంట పట్టణంలో నాడు ఎంపీగా ఉన్నప్పుడు ఆదర్శ రైల్వే స్టేషన్ ఎస్ టి ఓ ఆఫీసు తీసుకొచ్చారు అనేకమైన అభివృద్ధి పనులు చేశారు ఆయన ఆరోగ్యం అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకుంటూ రానున్న రోజుల్లో ఇంకా ఉన్నతమైన పదవులు రావాలని కోరుకుంటున్నాం ఈ కార్యక్రమంలో ములుగురి సదయ్య సతీష్ రెడ్డి సాయిని రవి పూదరి రేణుక శివ భాగ్యలక్ష్మి ఎండి సలీం పంజాల అజయ్ కౌన్సిలర్లు దిడ్డి రాము చందా రాజు మాచర్ల రాజు ఒగ్గు రమేష్ ఇంగిత అశోక్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వరరావు సూర్య మాజీ కౌన్సిలర్లు బొంగుని వీరన్న రవి కంటి రాజు పిట్టల రమేష్ మాజీ దేవస్థాన డైరెక్టర్ రామ్ రెడ్డి దుబ్బ మల్లన్న కమిటీ చైర్మన్ ముద్దమల రవి చిన్నింటి నాగేందర్ రాకేష్ ప్రసాద్ రాజు ఖలీల్ సునీల్ శివకృష్ణ యూత్ కాంగ్రెస్ నాయకులు ఎండి సజ్జు ప్రవీణ్ సింగిరెడ్డి రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# హరి స్వామి కంటి దవాఖాన ను ప్రారంభించిన

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్







**జమ్మికుంట మే 8 (ప్రజావాణి):**జమ్మికుంట పట్టణ పరిధిలోని బస్టాండ్ సమీపంలో హరి స్వామి కంటి దవాఖాన ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగపడేవిధంగా పట్టణంలో కంటి దవాఖాన ప్రారంభించుకోవడం శుభసూచకం అని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చందా రాజు డా.నాగరాజు డా.ప్రసాద్ డా.తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన నవ్యశ్రీకి ఘన సన్మానం

- ఆడపిల్లల విద్యతోనే సమాజ అభివృద్ధి.
- మాజీ జెడ్పీటీసీ గంట వెంకట రమణరెడ్డి.



**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి 08:**తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కల్వచర్ల గ్రామానికి చెందిన వేముల వెంకన్న సువర్ణ దంపతుల కుమార్తె నవ్యశ్రీ ఆదిలాబాద్ జిల్లాలోని తెలంగాణ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజీ లో చదివి ఎంపీసీ విభాగంలో 991 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు పొందడం ఎంతో గర్వకారణమని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో నవ్యశ్రీని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్,డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ.. ఆడపిల్ల చదివితే ఒక కుటుంబమే కాదు సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది. నేటి కాలంలో అమ్మాయిలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతూ ముందుకు సాగుతున్నారు. నవ్యశ్రీ సాధించిన విజయం గ్రామంలోని విద్యార్థినులకు స్ఫూర్తిదాయకం అని అన్నారు.అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని,చదువు ద్వారా వారు ఉన్నత స్థానాలకు చేరుకొని కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురాగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వచర్ల గ్రామ ఉపసర్పంచ్ కస్ప మహేందర్,వార్డు సభ్యులు మల్యాల పద్మ, పల్లెర్ల భాగ్యలక్ష్మి, మల్యాల శారద పాల్గొని నవ్యశ్రీని అభినందించారు.అలాగే గ్రామ పెద్దలు,యువకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం ర్యాలీ మరియు అవగాహన కార్యక్రమం



**గరిడేపల్లి ప్రజావాణి మే 8:**అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గరిడేపల్లి ఆధ్వర్యంలో అవగాహన మరియు ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ మరియు ఉప సర్పంచ్ సంజీవ హాజరయ్యారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైద్యాధికారి డాక్టర్ వి నరేష్ మాట్లాడుతూ ఈ వ్యాధి తల్లిదండ్రుల నుండి పిల్లలకు సంక్రమించే వారసత్వ జన్యుపరమైన రక్త రుగ్మత కలిగి శరీరంలో తగినంత హిమోగ్లోబిన్ లేదా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలను తయారు చేయలేదు. దీనివల్ల తీవ్రమైన రక్తహీనత కలుగుతుంది జీవిత కాలంలో వ్యాధి దీనిని నిరంతరం చికిత్స రక్తమార్పిడి అవసరం కావచ్చు, ప్రధానంగా ఆల్ఫా మరియు బీటా తల సేమియా అనే రెండు రకాలు ఉంటాయి.ఉత్పత్తికి సంబంధించిన జన్యు రూపం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీని లక్షణాలు తీవ్రమైన అలసట, బలహీనత, లేత చర్మం,ఎముకల వైకల్యం, మరియు పెరుగుదల మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వివాహానికి ముందు దంపతులు జెనెటిక్ కౌన్సిలింగ్ రక్త పరీక్షలు చేసుకోవడం ద్వారా అరికట్టవచ్చు తెలిపారు. మరియు వడదెబ్బ గురించి కూడా అవగాహన కల్పించారు ప్రస్తుతం ఎండలు బాగా ఉన్నందున ఏమైనా పనులు ఉన్నట్లయితే ఉదయం 11 గంటల లోపు సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు.తరచూ ద్రవపదార్థాలను తీసుకోవాల న్నారు ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ అంజయ్య గౌడ్ ఏఎన్ఎం కవిత వెంకన్న, నర్సిరెడ్డి, మంగమ్మ ఆశ కార్యకర్తలు ఉమా, ఉపేంద్ర సైదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

- ఘనంగా నిర్వహి ంచిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరు స్వప్న సదానందం




**జమ్మికుంట మే 8 (ప్రజావాణి):**తెలంగాణ రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పునస్కరించుకుని జమ్మికుంట జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్ ఆవరణలో అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించి అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావంలో పార్లమెంట్ సభ్యుడిగా ప్రభుత్వములో భాగస్వామిగా ఉంటూనే తెలంగాణ ఏర్పాటుకు కోసం పోరాటం చేసి పెప్పర్ స్ప్రే దాడులకు గురైన ఎక్కడ వెన్నుచూపని నాయకుడు పోరాట పటిమను చూసిన భారత నాయకులు తెలంగాణ టైగర్ గా పిలిచేవారు. నేటి ప్రజాప్రభుత్వం ఏర్పడ్డ తరువాత బీసీ కులగణన దిగ్విజయంగా పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలబెట్టడములో ముఖ్యపాత్ర నిర్వహించిన ఘనత పొన్నామన్న సొంతం. అంతే కాకుండా రాష్ట్ర రవాణా శాఖను పూర్తిస్థాయి డిజిటల్ చేసి కేంద్రప్రభుత్వ ప్రశంశలు అందుకున్న విజన్ ఉన్న నాయకుడు. నిరుపేదలకు అండగా నిలిచి అభువృద్ధిని పరుగులు పెట్టిస్తున్న మంత్రి పర్యావరణం దైవ భక్తి, విద్య, వైద్యం అభివృద్ధి పట్ల తనదైన శైలిలో ముందున్న నేటి ఆదర్శ నాయకుడు పొన్నం ప్రభాకర్ ని కొనియాడారు ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు మార్కెట్ సిబ్బంది నాయకులుకార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొని మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి రైతులకు అహమాలీలకు పనులు పంపిణీ చేసి మజ్జిగ ప్యాకెట్లు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారుఈ కార్యక్రమం లో మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి డైరెక్టర్లు దిక్షిత్ రాజేశ్వరరావు శ్యాం కందల తిరుపతి మనుపటి సూర్య శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# వీర్లపల్లె గ్రామంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- ప్రతిఒక్కరు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.
- టూ టౌన్,సిఐ ఎన్.ప్రసాద్ రావ్





**గోదావరిఖని,మన సమగ్ర ప్రజావాణి మే 08:**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా ఐపీఎస్ డిఐజి ఉత్తర్వుల మేరకు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీర్లపల్లి గ్రామంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. వెహికల్స్ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో భాగంగా గ్రామంలో టూ వీలర్స్,ఫోర్ వీలర్స్ వెహికల్స్ ను పరిశీలించడం జరిగింది. అందులో సరైన వెహికల్ డాక్యుమెంట్స్, నంబర్ ప్లేట్ లేని 50 వెహికల్స్ ను గుర్తించి సీజ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాద్ రావు మాట్లాడుతూ... ప్రతి ఒక్క టూవీలర్ వాహనం నడుపుతున్న వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వెనకాల కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పకుండా ధరించాలని,హెల్మెట్ కు గల క్లిప్పు పెట్టుకోవాలని సూచించారు.ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. తమ యొక్క వెహికల్ వెంట వెహికల్ కు సంబంధించిన డాక్యుమెంట్స్ ఇన్సూరెన్స్ ,పొల్యూషన్ వెంట ఉంచుకోవాలని,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా లేదా నెంబర్ ప్లేట్ లోని అక్షరాలను తొలగించడం నేరమని తెలిపారు.ముఖ్యంగా మైనర్ లకు బండి ఇవ్వడం నేరమని మైనర్లు బండి నడిపి పట్టుపడితే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. దొంగతనాలను దృష్టిలో ఉంచుకొని మాట్లాడుతూ మన గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు తారస పడినప్పుడు లేదా ఎవరైనా అనుమానితులు కనిపించినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు లేదా 100 కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు లేదా అనుమానితులు వచ్చినప్పుడు వారి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.నేరవృత్తి కలిగిన వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం కూడా నేరమని తెలిపారు.సైబర్ మోసాలు సంఖ్య రోజురోజుకు ఎక్కువవుతుందని,సైబర్ నేరాలను నివారించాలంటే అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ కు స్పందించకుండా ఉండాలని, మీ మొబైల్స్ కు వచ్చే ఓటీపీలు చెప్పమని అడిగినప్పుడు చెప్పకుండా జాగ్రత్త పడాలని సూచించారు.ఏదైనా సైబర్ మోసం జరిగినట్టు గుర్తించినప్పుడు వెంటనే 1930 కు ఫోన్ చేసి కంప్లైంట్ చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్ అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే మెసేజ్ లపై మరియు బ్లూ లింకులపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. దొంగతనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి వ్యక్తి బాధ్యతగా తమ ఇంటికి సీసీ కెమెరాలు అ మార్చుకోవాలని సూచించారు.తమ ఇంట్లో విలువైన వస్తువులు అనగా బంగారం,వెండి,డబ్బు ఇంట్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లో భద్రపరచుకోవాలని తెలిపారు.ఎవరైనా తీర్థయాత్రలకు,ఊర్లకు వెళ్ళినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్కు లేదా 100కు డయల్ చేసి చెప్పాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమాన్పూర్ ఎస్సై ప్రసాద్, గోదావరిఖని టూ టౌన్ ఎస్ఐ ఎండి అహ్మదుల్లా, గోదావరిఖని టు టౌన్ పోలీస్ స్టేషన్,కమాన్పూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి సీసీఈ విజ్ఞప్తి



**ప్రజావాణి//గోదావరిఖని :**పెద్దపల్లి జిల్లా పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరిఖని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథని కళాశాలలకు చెందిన అతిథి అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారానికి శుక్రవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ) కార్యాలయాన్ని ఆశ్రయించారు.జిల్లాలోని మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పెద్దపల్లి జిల్లా అతిథి అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా సీసీఈ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్‌ను కలిసి తమ సమస్యలను సమగ్రంగా వివరించారు.అతిథి అధ్యాపకులు ఎదుర్కొంటున్న పరిపాలనా, విధి నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాలను జేడీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సమస్యలను శ్రద్ధగా విని సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తగిన స్థాయిలో పరిశీలన చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల పరిస్థితిపై కూడా జేడీ రాజేందర్ సింగ్ ఆరా తీశారు. కళాశాలల వారీగా అడ్మిషన్లు ఎలా కొనసాగుతున్నాయి, విద్యార్థుల స్పందన ఎలా ఉంది అనే అంశాలపై అతిథి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అడ్మిషన్లు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని తెలుసుకుని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అతిథి అధ్యాపకులు మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా అడ్మిషన్ల పెంపు, బోధన నాణ్యత, అధ్యాపకుల సమస్యల పరిష్కారం వంటి అంశాలు పరస్పర సంబంధం కలిగినవని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అతిథి అధ్యాపక సంఘం అధ్యక్షుడు ముకుందం, సభ్యులు నరేష్, రామకృష్ణ, అంజయ్య, దుర్గం కృష్ణ, ఫర్జానా పాల్గొన్నారు. జిల్లాలోని అతిథి అధ్యాపకుల పరిష్కారానికి ఈ సమావేశం ఉపయోగపడుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

## ఐకెపి పి ఏ సి ఎస్ సెంటర్ల ద్వారా వరి ధాన్యం కొనుగోలు సేకరణను నువేగవంతం చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల శంకర్





**జమ్మికుంట మే 8 (ప్రజావాణి)**వాతావరణ మార్పులతో అకాల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందు న ప్రభుత్వ యంత్రాంగం నోటి కాడికి వచ్చే పంటను నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని హుజురాబాద్ మండలంలోని అన్ని సెంటర్లలో రైతులకు టార్ పళ్ళు పరదలు, అందించాలని బార్దాను హమాలి ట్రాన్స్పోర్ట్ సౌకర్యాలను వేగవంతం చేయాలని అలాగే కేటాయించిన మిల్లులోకి వెళ్ళినంక ధాన్యం బస్తా ఒక్కంటి మిల్లు యాజమాన్యాలు వివిధ కారణాలతో తరుగుదల పేరుతో రైతులను దోపిడీ చేయకుండా చూడాలని డిమాండ్ చేశారుసిపిఎం పార్టీ హుజురాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో శాలపల్లి చెల్పూర్ పాపయ్య పల్లి కేంద్రాలను సందర్శించడం జరిగినది ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కదిరే రమేష్ ప్రతాప శ్రీనివాస్ కొంకట చంద్రయ్య రాసపల్లి శంకర్ సారయ్య చిరంజీవిమహేష్.రవి తదితరులు పాల్గొన్నారు

# మైలారం గ్రామంలో పశు వైద్య శిబిరం



**ప్రజావాణి శాయంపేట :**మండలంలోని మైలారం గ్రామంలో పశువైద్య శిబిరము గ్రామ సర్పంచ్ నూనె దివ్య తిరుపతి అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరము నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ గ్రామంలో గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న ఆవులకు గేదెలకు పరీక్షలు చేశారు లేగ దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం సాధారణ పశు వైద్య చికిత్సలు నిర్వహించడం జరిగింది సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని పశువులను కాపాడుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో రమేష్ బాబు, రవి ,సదానందం, సుదర్శన్, రైతులు పాల్గొన్నారు

# వేసవి శిక్షణ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు.



**నేరేడుచర్ల మే 8(ప్రజావాణి):** పిఎంశ్రీ జిల్లాపరిషత్ఉన్నతపాఠశాల నేరేడుచర్ల వేసవి శిక్షణ శిబిరం లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాలలో ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. వేసవి సెలవులు అయినందున ఉదయం 8గ. నుంచి 12 గంటల వరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మరియు క్రీడల సాంస్కృతిక అంశాల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలకు వివిధ రకాల క్రీడలు, యోగ,సంప్రదాయ క్రీడలు, సాంస్కృతిక అంశాలు ధారాళంగా చదవటం,అందమైన చేతిరాతకొరకు తర్ఫీదు అందించడం వినోదాత్మక క్రీడలు విభిన్న సాంస్కృతిక అంశాలు, నృత్యాలపై శిక్షణ అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం యాదగిరి తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు,ఎం బాలు, డాన్స్ మాస్టర్ రాజు,వినోద్ కుమార్,నగేష్ సరస్వతి,సరిత తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో అన్నదాతకు కన్నీరు: కొట్టుకుపోయిన వడ్ల కుప్పలు

- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు బోడ రవి నాయక్ విజ్ఞప్తి







**చెన్నారావుపేట మే 08 (ప్రజావాణి) :**మండల పరిధిలోని ఎల్లయ్యగూడెం వరి కొనుగోలు కేంద్రంలో గురువారం కురిసిన అకాల వర్షం ఓ రైతు పాలిట శాపంగా మారింది. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి కేంద్రంలో ఆరబోసిన వడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి.?ఘటన వివరాల్లోకి వెళ్తే..ఎల్లయ్యగూడెం గ్రామానికి చెందిన రైతు బోడ రవి నాయక్ తాను పండించిన వరి పంటను విక్రయించేందుకు స్థానిక వరి సెంటర్‌కు తీసుకువచ్చారు. అక్కడే ఆరబోశారు. అయితే, గురువారం ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షం కురవడంతో, కొనుగోలు కేంద్రం జలమయమైంది. దీంతో రవి నాయక్‌కు చెందిన వడ్ల కుప్పలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మరికొంత ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది.?ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే నీటిపాలవడంతో రైతు రవి నాయక్ కన్నీరుమున్నీరవుతున్నారు.ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలనీ నష్టపోయిన తనని ఆదుకుని న్యాయం చేయాలనీ వేడుకుంటున్నారు.

# గో సంరక్షణ పథకానికి లక్ష రూపాయల విరాళం



**మన ప్రజావాణి చౌడేపల్లి, మే 8** శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం గో సంరక్షణ పథకానికి తిరుపతికి చెందిన శ్రీ V. సునంద కుమార్ రెడ్డి మరియు G. ఉషారాణి దంపతులు రూ. 1,00,000/-లను విరాళంగా అందజేశారు. అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం దిగువపల్లి గ్రామంలో ప్రముఖ శక్తి క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ కార్యక్రమాలకు సహాయంగా ఈ విరాళాన్ని అందజేసినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా దేవస్థాన ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి జీ. ఏకాంబరం దాతలైన దంపతులకు ప్రత్యేకంగా అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.గో సంరక్షణకు భక్తులు ముందుకు రావడం అభినందనీయమని, దేవస్థాన అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.భక్తుల విరాళాలతో దేవస్థానంలో గో సంరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఉచిత పశు వైద్య శిబిరం




**చెన్నారావుపేట మే 08 ప్రజావాణి** మండల పరిధిలోని అక్కల్‌చెడ గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ ఆధ్వర్యంలోవెటర్నరీ డాక్టర్ మంగీలాల్ సహకారంతో ఈ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ మంగీలాల్ మాట్లాడుతూ.. గ్రామంలోని పాడి రైతులు తీసుకువచ్చిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని, పలు పశువులకు చూడి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.?అనంతరం సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి ఉచిత వైద్య సదుపాయాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వెటర్నరీ డాక్టరు సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. వైద్యులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.?ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, వార్డు సభ్యులు ఇస్లావత్ స్వరూప, వీరు, రైతులు తేజవత్ బద్రు, వీరు నాయక్, రాజు, ప్రవీణ్, విజేందర్, వెటర్నరీ అసిస్టెంట్ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం లోని అంకాళమ్మ వారికి విశేష పూజలు



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 8 (ప్రజావాణి):** లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (08.05.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది.ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి.కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది.కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన దమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకృతురాలైనా కర్ణాభరణాల ను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి

# వైభవంగా వైష్ణవి దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు



**మన ప్రజావాణి చౌడేపల్లి, మే 8 :**అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం పుదీపట్ల గ్రామంలోని స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అమ్మవారితో పాటు అభయాంజనేయ స్వామి, నాగ భైరవ స్వామి వారికి ఆలయ అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా పుంగనూరుకు చెందిన బాలాజీ రావు దంపతులు ఉభయదారులుగా పాల్గొని అమ్మవారికి మంగళసూత్రాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడేపల్లి, పుంగనూరు మరియు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. శుక్రవారం సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# పోలీసులపై ఆరోపణలు అవాస్తవం

- డీఎస్పీ సత్తయ్య గౌడ్.





**కొండాపూర్, మే 8(ప్రజావాణి):** కొండాపూర్ మండలం తోగర్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీధర్ రెడ్డి పోలీసులపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అలియాబాద్ శివారులో ఏర్పాటు అవుతున్న పరిశ్రమ యాజమాన్యాన్ని శ్రీధర్ రెడ్డి బెదిరింపులకు గురి చేస్తున్నాడని వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిపారు. మొదట ఆయనను మర్యాదపూర్వకంగా కూర్చోబెట్టి మాట్లాడినప్పటికీ, విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారిణిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఎస్సై కింద కూర్చోబెట్టారని వివరించారు.పోలీసులు ఇచ్చిన మర్యాదను తామే దుర్వినియోగం చేసుకోవడం వల్లే ఆ పరిస్థితి ఏర్పడిందని డీఎస్పీ పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం గానీ, గ్రామ పెద్దలతో చర్చించడం గానీ చేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.శ్రీధర్ రెడ్డిపై గతంలోనే నాలుగు కేసులు నమోదై ఉన్నాయని, తనపై కేసు నమోదు అవుతుందని ముందుగానే తెలిసి ఉద్దేశపూర్వకంగా వ్యవహరించినట్లు వీడియోల్లోనే చెప్పాడని డీఎస్పీ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో సీఐ సుమన్, ఎస్సై సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

- ముందసలో ఐటిడిఏ ప్రాజెక్టు మంజూరు చేయాలి..
- గిరిజనులు భూములకు సాగునీరు ఇవ్వాలి
- గిరిజన శక్తి సంక్షేమ సంఘం









**పలాస ప్రజావాణి ప్రతినిధి :**శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం లోని మందస మండలంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలనీ కోరుతూ గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధికారులు వినతి పత్రము ఇచ్చారు.ముఖ్యంగా మందస లో ఐటీడీఏ ప్రాజెక్టు మంజూరు చేయాలనీ కోరారు.అలాగే పంటలు సాగు కోసము లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా జీడీ పంటకు మద్దతు ధర కూడా కల్పించాలని ,అపరిష్కృతంగా ఉన్న గిరిజనులు భూములకు భూ హక్కు పట్టాలు ఇవ్వాలని, శ్రీకాకుళం జిల్లాలో గిరిజన ప్రాంతాలను ఐదవ షెడ్యుల్ లో కలపాలని ,సిమెంట్ రోడ్లు మంజూరు చేయాలనీ, కొబ్బరి చెట్లూరు గేటు నుంచి కొండలోగాము ,కిలోయి వరకు తారు రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధికారులకు వినతి పత్రము ఇచ్చారు..ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘము రాష్ట్ర నేత కోనేరు రమేష్, గిరిజన సంఘము అధ్యక్షులు సవర నరసింహారావు, కార్యదర్శి సవర మాధవ రావు, మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్ , బొగాబంద మాజీ సర్పంచ్ జగ్గారావు, దశరథ,శ్రీను, కోదండ రావు తదితరులు పాల్గొన్నారు..

# కనీస సౌకర్యాలు కరువైన మంథని బస్టాండ్

- ముప్పై నెలలుగా సున్నం వేయించలేని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్.
- పుట్ట లింగమ్మ ఏం పాపం చేసిందని పేరు తొలగించిండ్లు.
- తాను పరిశీలనకు వస్తున్నానంటేనే పనులు చేయిస్తున్నారు.
- ఆనాడు రూ.మూడు కోట్ల నిధులతో బస్టాండ్ సుందరీకరించాం.
- బస్టాండ్ అస్తవ్యస్తం కావడానికి దుద్దిళ్ల కుటుంబమే కారణం.
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.






**మంథని,మన సమగ్ర ప్రజావాణి మే 08 :**మంథని ఎమ్మెల్యే ముప్పై నెలలు...దుద్దిళ్ల కుటుంబం నలభై ఏండ్ల పరిపాలనలో మంథని బస్టాండ్‌కు సున్నం వేయించలేని పరిస్థితుల్లో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఉన్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.శుక్రవారం మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవని,టీవి పనిచేయడంలేదని,నీళ్లు రావడం లేదని,మరుగుదొడ్లు సరిగ్గా లేవని ఆయ అన్నారు. తాము పరిశీలనకు వస్తున్నామంటే ట్రాక్టర్ పెట్టి బస్టాండ్ ఆవరణను పరిశుభ్రం చేయిస్తున్నారని ఆయన విమర్శించారు.30 నెలల్లో మంథని ఎమ్మెల్యే సాధించింది ఆర్టీసీ బస్టాండ్‌ను మురికికూపంలా మార్చడమేనని ఆయ ఎద్దేవా చేశారు.తండ్రి ఆశయాలు నెరవేర్చుతామని పదే పదే చెప్తున్న మంథని ఎమ్మెల్యే తండ్రి కట్టించిన బస్టాండ్‌కు కనీసం సున్నం వేయించడా అని ప్రశ్నించారు.ఆనాడు తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రూ.3కోట్లు వెచ్చించి సుందరీకరణ చేశామని,ఈ బస్టాండ్ ద్వారాప్రయాణించే వారు మా కుటుంబ సభ్యులుగా బావించి అనేక వసతులు,సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. బస్టాండ్‌లో పిల్లతల్లులు వస్తే బిడ్డకు పాలచ్చేందుకు ప్రత్యేకంగా తన తల్లిపేరున బేబీ ఫీడింగ్ రూం ఏర్పాటు చేశామని,కానీ ఈనాడు తన తల్లి పుట్ట లింగమ్మ పేరును తొలగించిన నీచుడు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరన్నారు.ప్రతి రోజు తనను తిట్టిపిస్తాండ్లని మంథని ఎమ్మెల్యే ఉపన్యాసాలు ఇస్తున్నాడని, కానీ కమాన్‌పూర్‌లో ఓ రజక సోదరుడు,కాటారంలో ఎస్సీ సోదరుడు,బేగంపేటలో ఓ గౌడ సోదరుడితో తిట్టిపిస్తూ తాను మాత్రం మంచోడిగా చలామణి అవుతూ పక్కోడిని మాత్రం సమాజానికి దోషిగా చూపించే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన అన్నారు.తన తల్లి ఏం పాపం చేసిందని పేరు తొలగించాడో సమాధానం చెప్పాలన్నారు. దుద్దిళ్ల కుటుంబానికి 40ఏండ్లు ఈ నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇచ్చిండ్లని,కనీసం బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించరా అని ఆయన అసహనం వ్యక్తం చేశారు.బస్టాండ్‌కు మీ బంధువులు,అక్కా చెల్లెల్లు వస్తే ఇక్కడి బాధలు తెలిసి ఉండేవని ఆయన అన్నారు. మొదటి సారి బీసీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బస్టాండ్‌ల సుందరీకరణ చేపట్టామని, కాటారం,కాళేశ్వరం, మంథని, మహదేవ్‌పూర్ బస్డాండ్‌లను సుందరీకరణ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మంథని బస్టాండ్‌లో పార్క్‌ను ప్రతిపాదించామని,ఇలాంటి పనులపై దృష్టిపెట్టని సన్నాసి మంథని ఎమ్మెల్యే అని అన్నారు.నీ తండ్రిని మాత్రమే పూజించమని చెప్పే నీచ సంస్కృతికి నిలువెత్తు సాక్ష్యం మంథని ఎమ్మెల్యే అని, బస్టాండ్‌లో ఒక్క బేంచీ వేయించావా,ప్యాన్ పెట్టావా అని ప్రశ్నించారు.శ్రీపాద ట్రస్టు ఎక్కడ పోయిందని దోచుకోవడానికి మత్రమే ట్రస్టు పని చేస్తుందన్నారు.30నెలల పాలన ఎలా అస్తవ్యస్తమయిందో బస్టాండ్‌ను చూస్తే అర్థం అవుతుందని,బస్టాండ్ అస్తవ్యస్తం కావడానికి దుద్దిళ్ల కుటుంబమే కారణమన్నారు. ఈ సమాజానికి రాజ్యాంగం అర్థం కాకుండా ఓటు విలువ తెలువకుడా తొక్కిపెట్టి రాజ్యం ఏలుతున్నారని ఆయన విమర్శించారు. సమాజాన్ని మేలు కొల్పే వరకు తమ పోరాటం ఆగదని,ప్రతి రోజు తనను తిట్టే వాళ్లంతా ప్రజల కోసం పని చేయాలని ఆయన హితవు పలికారు.దేశంలో రాజ్యాంగం ప్రజాస్వామ్యం తెలిసిన కుటుంబం మీది మా సమాజానికి రాజ్యాంగం ప్రజాస్వామ్యం తెలియదు కనుకనే నిలదీయం లేదని, గల్లపట్టి అడిగే రోజు వచ్చే వరకు మా పోరాటం అగదని నీ కార్యకర్తలతోటి నిన్న చీ అని తిరస్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# అంబారిపేటలో యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో క్రీడాకారులకు ప్రోత్సాహం



**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి మే 08 (ప్రజావాణి):**జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామంలో యువ క్రీడాకారులకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు, ప్రభుత్వం మంజూరు చేసిన ఈ కిట్లను కాంగ్రెస్ పార్టీ నాయకుడు, అఖిల భారత యాదవ మహాసభ యువత రాష్ట్ర కార్యదర్శి ఎలుక రాజు యాదవ్ అంబేద్కర్ విగ్రహ ఆవరణలో క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన ఆకాంక్షించారు.క్రీడాకారుల విజ్ఞప్తిని మన్నించి, తక్షణమే స్పందించి క్రికెట్ కిట్లను మంజూరు చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు రాజు యాదవ్ తో పాటు గ్రామ క్రీడాకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంచినీళ్ల కుమారస్వామి, దూట సత్యం, బందరకంటి పవన్, దర్శనాల రవీందర్, నాయకులు జాడి రాజేశం, తనుగుల సత్యనారాయణ గౌడ్, ఆరెల్లి మహేష్, దుంపెటి చంద్రయ్య, కేడం చంద్రయ్య, అల్లంల రాయమల్లు, మోతే సత్యం, ఆరెల్లి సత్యం, అల్లంల రాజయ్య, ఆరెల్లి అనిల్, శ్రీహరి, గ్రామంలోని క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

- మే 19 వరకు దరఖాస్తులు

**మన ప్రజావాణి చౌడేపల్లి మే 8**పుంగనూరు డివిజన్ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సోదం మండలాల రైతులకు ాహీూవీ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించనున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. 2025-26 సంవత్సరానికి రూ.31.07 లక్షల సబ్సిడీ నిధులు కేటాయించారని పేర్కొన్నారు.ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, కోత నూర్పిడి యంత్రాలు, విత్తే, నాటే యంత్రాలు తదితర పరికరాలపై ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు మరియు మహిళలకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని, 2024-25లో లబ్ధి పొందిన వారు అర్హులు కాదన్నారు. ట్రాక్టర్ ఆధారిత పరికరాలకు ట్రాక్టర్ ఆర్సీ కాపీ తప్పనిసరిగా సమర్పించాలన్నారు.రైతులు మే 19లోపు రైతు సేవా కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికను లాటరీ విధానంలో నిర్వహించి, ఎంపికైన వారికి మొబైల్ సందేశాల ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు.మే 23 నుంచి 25 వరకు లాటరీ ప్రక్రియ నిర్వహించి, ఎంపికైన రైతులు మే 26 నుంచి జూన్ 9లోపు తమ వాటా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం జూన్ 26లోపు యంత్రాలను సరఫరా చేస్తారని వెల్లడించారు.ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ విషయాన్ని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి కూడా తెలియజేశారు.

# దళిత క్రైస్తవుల ను అణగదొక్కలనే కుట్ర.

- ఈ అంశం పై ఏ రాజకీయ నాయకులు స్పందించలేదు.
- ఈనెల 12న కరీంనగర్‌లో భారీ సభ కు తరలి రావాలని పిలుపు.
- సభలో పాల్గొననున్న మందకృష్ణ మాదిగ.
- మన హక్కులను మనమే కాపాడుకుందాం.




**రాజన్న సిరిసిల్ల /ప్రజావాణి :**దళిత క్రైస్తవులపై జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్న "దళిత క్రైస్తవుల హక్కుల సమ్మేళనం"కు పెద్ద ఎత్తున హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....జిల్లాలోని క్రైస్తవులు అందరూ కుల, మత భేదాలు లేకుండా సభకు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన క్రైస్తవులు ఉన్నప్పటికీ, ముఖ్యంగా ఎస్సీ క్రైస్తవులపైనే వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది మత కల్లోలాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దళిత క్రైస్తవుల హక్కులను కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే దళిత క్రైస్తవుల హక్కులను అణగదొక్కే కుట్ర చేస్తోందని విమర్శించారు. దళిత క్రైస్తవులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు పరిధిలో వచ్చిన జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఏ రాజకీయ పార్టీ నాయకుడు కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు ."మన హక్కులను మనమే కాపాడుకోవాలి.. అందరం ఒక్కటిగా పోరాడుదాం" అని సభ నిర్వాహకులు పిలుపునిచ్చారు

# చైర్మన్ బాధ్యతలు చేపట్టిన కుసుమ శరత్

- హైకోర్టు తీర్పుతో పిఎసిఎస్ పాలకవర్గం పునరుద్ధరణ



**ప్రజావాణి శాయంపేట :**పిఎసిఎస్ చైర్మన్ గా కుసుమ శరత్ బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా పాలకవర్గ సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించారు. గత డిసెంబర్ లో ప్రభుత్వం 91 సంఘాల పాలకవర్గాలను రద్దుచేసి ఇన్చార్జిలను నియమించింది. దీంతో పిఎసిఎస్ చైర్మన్ లు పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు.పదవి కాలం ముగియకముందే పాలకవర్గాన్ని రద్దు చేయడం చట్ట విరుద్ధమని సవాల్ చేస్తూ హైకోర్టు ను ఆశ్రయించారు. ఈ క్రమంలో పాలకవర్గ సభ్యులకు హైకోర్టు అనుకూలమైన తీర్పును వెలువరించింది. ప్రభుత్వం రద్దు చేసిన సంఘాలను కొట్టివేస్తూ పాతపాలకవర్గాల నే కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వ డీసివోలకు ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తున్నామని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. పలువురు నాయకులు చైర్మన్ కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు, పిఎసిఎస్ సీఈవో రాజమోహన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడికి నిరసనగా బీఆర్ఎస్ ధర్నా

- తెలంగాణలో బీజేపీ గుండాల దాడులు పెరిగాయి.
- ఎమ్మెల్యే స్థాయి నాయకులకే రక్షణ లేదు.
- రాష్ట్రం లో "లా అండ్"ఆర్డర్ దెబ్బతిందని ఆరోపించారు.
- వేములవాడ తెలంగాణ చౌక్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ.



**రాజన్న సిరిసిల్ల జిల్లా/ప్రజావాణి:**వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్,బీజేపీ గుండాల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆరోపించారు. అనంతరం తెలంగాణ చౌక్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. "బీజేపీ గుండాలారా ఖబర్దార్" అంటూ నినాదాలు చేశారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బీజేపీ గుండాలు చంపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని ఆరోపించారు. కరీంనగర్ పట్టణంలో గన్‌లతో దొంగతనాలు జరుగుతున్నా కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే స్థాయి నాయకులకే రక్షణ లేకుండా పోయిందని విమర్శించిన నేతలు, కేంద్ర మంత్రి బండి సంజయ్ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధిపై రాజకీయ చర్చలు జరగాలి గానీ భౌతిక దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనం, క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ నాయకురాలు పావని గౌడ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, సిరిగిరి చందు, మారం కుమార్, వాసాల శ్రీనివాస్, కందుల క్రాంతి కుమార్, గన్నమనేని రామారావు, కొండ కనుకయ్య, నీలం శేఖర్, నీరటి మల్లేశం, అంజద్ పాషా, లైసెట్టి మల్లేశం, గుడిసె సదానందం, రేగుల రాజేశం, ఉల్లెందుల హనుమంతు, సుంకపాక రాజు, నిమ్మశెట్టి రాజు, గోసుకుల నరసయ్య, పబ్బ మహేష్, సంజీవ్, మంత సందీప్, మామిండ్ల కనకయ్య, రాధాకిషన్ రావు, పెద్ది రాజు, సయ్యద్ ఉమర్, రఫిక్, అసద్, షాహిద్, నల్ల సతీష్ రెడ్డి, మెండె రాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

# స్వేరోస్ సీనియర్ లీడర్ గురవయ్య కుటుంబానికి "భీమ్ హోం" హామీ

- ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పరామర్శ నివాళి





**చిలుకూరు మే 08(ప్రజావాణి):** చిలుకూరు మండల కేంద్రానికి చెందిన స్వేరోస్ సంస్థ క్రియాశీలక కార్యకర్త, ఆటో డ్రైవర్ కందుకూరి గురవయ్య స్వేరో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ పరామర్శించి, గురవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ,గురవయ్య లాంటి నిస్వార్థ కార్యకర్తలు స్వేరోస్ ఉద్యమానికి పునాదిరాళ్లు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూనే,సొంత ఖర్చులతో రాష్ట్రమంతా తిరిగి స్వేరో భావజాలాన్ని ప్రచారం చేశారు. భార్య మరణించినా ఇద్దరు పిల్లలను ఒంటరి తండ్రిగా పెంచిన ఆయన త్యాగం మరువలేనిది అని కొనియాడారు. అలాగే పిల్లల చదువు బాధ్యత కూడా స్వేరోస్ సంస్థ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గురవయ్య ఆశయ సాధన కోసం మనమంతా పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం" అని ప్రవీణ్ కుమార్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య స్వేరో , సీనియర్ నాయకులు చడపంగు రవి, జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ వీరాస్వామి, నాయకులు కందుకూరి ఉపేందర్ , ముదిగొండ చిరంజీవి, కందుకూరి శ్రీను, ముదిగొండ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్లిష్టమైన శస్త్ర చికిత్సలకు నిలయంగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

- ప్రచురణార్థం డీసీహెచ్ఎస్ కార్యాలయం





**ప్రజావాణి న్యూస్ జిల్లా ప్రతినిధి పెద్దపల్లి మే 08**జమ్మికుంట పట్టణానికి చెందిన మడిపల్లి గ్రామ నివాసి అయిన 18 సంవత్సరాల యువతికి, ఆమె నాలుగేళ్ల వయస్సులోనే ఎడమ మోకాలి పైభాగంలో చిన్న ఎముక పెరుగుదల (బోన్ ట్యూమర్) గుర్తించారు. ఆ సమయంలో శస్త్ర చికిత్స చేయడం సాధ్యం కాదని, 18 సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత చికిత్స చేయాలని అప్పటి వైద్యులు సూచించారు. తదుపరి యువతికి 18 సంవత్సరాలు వచ్చిన తర్వాత ప్రైవేట్ ఆసుపత్రుల్లో సంప్రదించగా, ఈ శస్త్ర చికిత్సకు భారీ ఖర్చు అవుతుందని తెలిపారు. అయితే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన మరియు క్లిష్టమైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలుసుకుని, బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ని సంప్రదించారు. వెంటనే స్పందించిన సూపరింటెండెంట్ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కుమార్ గౌడ్ తో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహింపజేసి, ఈరోజు యువతికి అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి బోన్ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్ర చికిత్సలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుమార్ గౌడ్, డాక్టర్ వినయ్, మత్తు వైద్యురాలు డాక్టర్ స్వాతి పాల్గొన్నారు. విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2డీ ఎకో సేవలు, ఆధునిక లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు, రూట్ కెనాల్ చికిత్సలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సేవలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సానిటేషన్, వాష్‌రూమ్ పరిశుభ్రత లేదా ఇతర సమస్యలు ఉన్నా, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా వెంటనే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని, ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు పూర్తిగా ఉచితమని, ఎవరికి ఎలాంటి లంచాలు ఇవ్వవద్దని సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథని గోదావరిఖని పెద్దపల్లి నుంచి అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికై హైదరాబాద్ ప్రయాణం.



**మంథని. మన ప్రజావాణి.** మంతిని డిగ్రీ కళాశాల నుంచి గోదావరిఖని పెద్ద పెల్లి నుంచి అతిధి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికై అతిధి ఆధ్యాపకుల సంఘం అధ్యక్షులు ముకుందం హైదరాబాద్ కు కమిషనర్ కళాశాల విద్య సి సి ఈ కు వెళ్లడం జరిగింది సి సి ఈ లో జెడి రాజేందర్ సింగ్ ను కలిసి సమస్యలు వివరించడం జరిగింది సమస్యలు విని సానుకూలంగా స్పందించడం జరిగింది . జె.డి గారు డిగ్రీ అడ్మిషన్ల గురించి అతిధి అధ్యాపకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు అడ్మిషన్లు జరుగుతున్న తీరును తెలుసుకొని సంతోషం వ్యక్తం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో అతిథి అధ్యాపక సంఘం నాయకులు నరేష్ రామకృష్ణ అంజయ్య దుర్గం కృష్ణ పర్ హన గార్లు పాల్గొన్నారు

# జి.ఓ ఎం.ఎస్ నెం 38 ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి...

- సంబంధిత అధికారులకు సూచించిన అదనపు కలెక్టర్ భాస్కరరావు.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08**జి.ఓ. ఎం.ఎస్. నెంబర్ .38 ప్రకారం ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు పార దర్శకంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో సాధారణ బదిలీలకు సంబంధించిన సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ ఎం.ఎస్ నెంబర్ 38 నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఒక కార్యాలయం లేదా విభాగంలో 40 శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగులను బదిలీ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఒకే స్థానంలో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులను కూడా సాధారణ బదిలీల పరిధిలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. బదిలీల ప్రక్రియలో ఎటువంటి వివక్ష లేకుండా సీనియారిటీ , పని చేసిన కాలం , పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకొని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల అభ్యర్థనలు , ఖాళీల వివరాలు, శాఖల అవసరాలను సమన్వయం చేస్తూ నిబంధనలకు అను గుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , జిల్లా జేపీసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి , జడ్పీ సీఈవో శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కిషోర బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- చెన్నారావుపేటలో స్నేహ సంఘాల అవగాహన సదస్సు



**చెన్నారావుపేట మే 08 ప్రజావాణి :**బాలికలు విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని, చిన్న వయసులో వివాహాలు చేసుకుని జీవితాలను ఇబ్బందుల్లో పడేసుకోవద్దని నవభారతి వివో కార్యదర్శి వైనాల రజిత పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన చెన్నారావుపేట గ్రామంలో స్నేహ సంఘాల ఆధ్వర్యంలో పదకొండు నుండి పద్దెనమీది ఏళ్ల వయస్సు గల కిషోర బాలికలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని, అప్పటి వరకు కష్టపడి చదువుకుని సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. నేటి కాలంలో స్మార్ట్‌ఫోన్ల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరిస్తూ.. చదువుకునే వయసులో సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా యాప్‌లకు బానిసలు కావొద్దని హితవు పలికారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ మాట్లాడుతూ.. బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఝాన్సీ లక్ష్మి, రుద్రమదేవి, మైత్రి బాలికల సంఘాల సభ్యులు పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివో ఏలు మేకల సుధా, కుసుమ ఆమని, మంగశెట్టి మంజుల, అంగన్వాడీ టీచర్లు దేవమ్మ, విజయ, ఆశా కార్యకర్తలు వసుమతి, విజయ, సుశీల, కిషోర బాలికలు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పశు వైద్య శిబిరం





**చిలుకూరు మే8 (ప్రజావాణి:)** మండల కేంద్రంలో ప్రాథమిక పశు వైద్య కేంద్రం చిలుకూరు నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంను చిలుకూరు సర్పంచ్ కొల్లు పుల్లమ్మ , జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శిబిరము, మేలు జాతి దూడల ప్రదర్శన వేసవి కాలం నందు పశువుల యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమంలో ఉచితముగా 63 పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ క్యాంపు నిర్వహించడం జరిగినది. మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించి మేలు జాతి దూడలకు బహుమతులు అందజేయడం జరిగినది. అలాగే పాల పోటీలు నిర్వహించి ఈ సంవత్సర కాలంలో అధికంగా పాలు పోసిన రైతులు సుజాత, సురేష్ లకు బహుమతులు అందజేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో నందు జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ బి శ్రీనివాసరావు ,డాక్టర్ పి పెంటయ్య ,అసిస్టెంట్ డైరెక్టర్ ఏవీహెచ్ కోదాడ, చిలుకూరు మండల పశువైద్యాధికారి డాక్టర్ కె వీరారెడ్డి,చిలుకూరు మండల గోపాల మిత్రులు ,సిబ్బంది జిల్లా మత్స్యశాఖ అధికారి,డిసిఓ, మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మత్స్యశాఖ సైంటిస్ట్, కోదాడ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్,చిలుకూరు వైస్ సర్పంచ్ నాగయ్య, చిలుకూరు ఏఓ , చిలుకూరు మత్స్య సంఘం సొసైటీ అధ్యక్షులు , రైతులు తదితరులు పాల్గొన్నారు

## సుందరగిరి క్షేత్రంలో వైభవంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి



**మన ప్రజావాణి ప్రతినిధి (చిగురుమామిడి):**తెలంగాణ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు చిగురుమామిడి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సుందరగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో అత్యంత వైభవంగా నిర్వహించారు. మంత్రి గారి జన్మదినాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ ఆలయ అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి గారు మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. బిఈ కార్యక్రమంలో చిగురుమామిడి మండలం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు మార్క రాజ్ కుమార్,బొమ్మనపల్లి సర్పంచ్ కొంకట మౌనిక, ఉల్లంపెల్లి సర్పంచ్ అలువల శంకర్, నవాబ్ పేట సర్పంచ్ గుళ్ళ రజిత రాజు,డి సి సి కార్యదర్శి సాంబారీ బాబు, జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్, ఐరెడ్డి సత్య నారాయణ రెడ్డి, పూల లచ్చి రెడ్డి,మాజీ ప్రజాప్రతినిధులు శ్రీమూర్తి రమేష్,ఇనుగల శ్రీనివాస్ రెడ్డి జిల సంపత్, గాదెపాక సునీల్, దొడ్ల రమణ రెడ్డి, ఎనగందుల లక్ష్మణ్, కిషోర్,శ్రీమూర్తి రాజ్ కుమార్,చెంచల ప్రభాకర్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలో పోషకాహారం పంపిణీ



**రాయికల్; మే 08 (ప్రజావాణి):** రాయికల్ మండలంలోని మూటపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఐసిడిఎస్ సిడిపివో రాజశ్రీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సందర్భంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు 6 నెలల నుంచి 3సంవత్సరాల పిల్లలకు 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు బరువులు ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కలిగించి వారికి 25 రోజులకు సరిపడా సరుకులు బియ్యం,పప్పు, నూనె,గుడ్లు,పాలు, బాలామృతం, బాలామృతం ప్లస్, మురుకులు ఇంటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లులకు ఎండలు బాగా ఉన్నందున పిల్లలు తల్లులు తీసుకొనవలసిన జాగ్రత్తలు ఎక్కువసార్లు పానీయాలు వాటర్,కొబ్బరి నీళ్లు తాగించవలెనని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మమత,అనూహ్య, అంగన్వాడీ టీచర్లు జి. గంగమ్మ,పి.రాజవ్వ, గర్భవతులు,బాలింతలు తల్లులు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలోని వెండి నాగాభరణం సమర్పణ





**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 8 (ప్రజావాణి ):**ఈ రోజు (08.05.2026) శ్రీ జి. చిరంజీవి,, నాగర్ కర్నూల్ వారు అయిదు శిరస్సులతో కూడిన వెండి నాగాభరణాన్ని దేవస్థానమునకు సమర్పించారు. ఈ వెండి నాగాభరణం బరువు 565 గ్రాములు. ఆలయ ప్రాంగణములోని ఆశీర్వచన మండపములో దాతలు వీటిని అమ్మవారి ఆలయ పర్యవేక్షకులు గంజి రవి, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జున, గుమాస్తా శ్రీమతి సావిత్రిలకు అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

## మొక్కజొన్న రైతుల గోడు పట్టదా?

- ఎమ్మెల్యే సొంత మండలములోనే రైతుల పరిస్థితి ఇలా తయారైంది
- కొనుగోలు కేంద్రంలో సీఈఓను నిలదీసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- తడిసిన ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- నిల్వ ఉన్న గోనె సంచులను రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు
- అలసత్వం వీడకుంటే ఆందోళన తప్పదు







**చెన్నారావుపేట మే 08 ప్రజావాణి :**మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ధాన్యం రాశుల వద్ద వేచి ఉన్న రైతులు తమ గోడును ఆయన వద్ద వెళ్లబోసుకున్నారు. అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్నలను చూపిస్తూ, కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడాతూ.?ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత తడిసిన మొక్కజొన్నల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని పెద్ది డిమాండ్ చేశారు. రైతులు రెండు సార్లు ధర్నా చేసినా స్థానిక ఎమ్మెల్యేకు పట్టనట్టుగా వ్యవహరించడం శోచనీయమన్నారు. సహకార సంఘం సీఈఓ చిట్టె రవిని నిలదీస్తూ.. తడిసిన ప్రతి గింజా కొనుగోలు చేసే బాధ్యతను అధికారులే తీసుకోవాలని హెచ్చరించారు.?గోనె సంచుల నిల్వపై మండిపడ్డారు.సహకార సంఘం వద్ద పదివేల గోనె సంచులు నిల్వ ఉన్నప్పటికీ,వాటిని రైతులకు ఇవ్వకుండా బయట కొనుగోలు చేసేలా ఇబ్బందులకు గురిచేయడంలో అంతర్యమేమిటని పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. రైతులు సొంతంగా బస్తాలు కొనుక్కుని ధాన్యం నింపినప్పటికీ, కాంటాలు వేయడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారు? అని మండిపడ్డారు. ప్రస్తుతం సుమారు 20 వేల బస్తాలు నింపి సిద్ధంగా ఉన్నాయని, మరో 40 వేల బస్తాల ధాన్యం కళ్ళాల్లోనే ఉందని, వీటిని ఎప్పుడు గోదాములకు తరలిస్తారని నిలదీశారు. ఎమ్మెల్యే సొంత మండలములోనే రైతుల పరిస్థితి ఇలా తయారైంది అంటూ పెద్ది ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కన్వీనర్ జక్కా అశోక్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న 10 వేల బస్తాలను వెంటనే రైతులకు పంపిణీ చేస్తే, వారు ధాన్యాన్ని నింపుకుని పరదాలు కప్పుకునే అవకాశం ఉంటుందని సీఈఓకు సూచించారు. దీనికి సీఈఓ చిట్టె రవి సానుకూలంగా స్పందిస్తూ, వెంటనే బస్తాల పంపిణీ చేపట్టి కాంటాలు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న,మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్,సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ,మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లు అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్,కొండవీటి ప్రదీప్ కుమార్,మండల కార్యవర్గ సభ్యులు కోశాధికారి గుర్రం రవి,మండల యూత్ అధ్యక్షులు మంచోజు మనోజ్,మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్ ,మండల నాయకులు ఎర్ర మల్లారెడ్డి,సంపత్ రెడ్డి,మూడు రమేష్, మండల నాయకులు,ప్రజా ప్రతినిధులు సర్పంచులు, వార్డు మెంబర్లు,గ్రామ పార్టీ అధ్యక్షులు,మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు ,బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం...

- హాజరైన అడిషనల్ కలెక్టర్ వెంకా రెడ్డి.






**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08:**యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం రోజు అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం జాతీయ పతాకంతో పాటు రెడ్ క్రాస్ జెండాను ఎగరవేసారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, "రెడ్ క్రాస్ సంస్థ మానవత్వానికి ప్రతీక అని1863లో హెన్రీ డ్యునాంట్ చే స్థాపించబడిన ఈ సంస్థ యుద్ధాలు , ప్రకృతి వై పరీత్యాలు , అంటువ్యాధుల సమయంలో కుల , మత , ప్రాంతాలకు అతీతంగా బాధితులకు సేవ లందిస్తోందని తెలిపారు. 'మానవత్వం , నిష్పాక్షికత , తటస్థత , స్వాతంత్ర్యం , స్వచ్ఛంద సేవ , ఐక్యత , సార్వత్రికత' అనే 7 ప్రాథమిక సూత్రాలతో రెడ్ క్రాస్ వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం" అని కొనియాడారు. "కోవిడ్ సమయంలో అలాగే వరదలు వచ్చినప్పుడు రెడ్ క్రాస్ వాలంటీర్లు ముందుండి సేవలు అందించారన్నారు. రక్తదాన శిబిరాలు , ఉచిత వైద్య శిబిరాలు , ప్రథమ చికిత్స శిక్షణ , విద్యార్థులకు యువతకు ప్రతి ఒక్కరికి సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారని తెలిపారు. యువత రెడ్ క్రాస్ స్ఫూర్తిని అలవర్చుకొని స్వచ్ఛంద సేవలో పాల్గొనాలని అలాగే. ప్రతి ఒక్కరూ 'సేవే మార్గం' అని భావించి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి" అని పిలుపు నిచ్చారు. రెడ్ క్రాస్ జిల్లా కమిటీ చైర్మన్ గుర్రం లక్ష్మీ నర్సింహారెడ్డి , డివిజన్ కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మెంబర్షిప్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడు తున్నామని కావున సేవా దృక్పథం కలవారు రెడ్ క్రాస్ లో మెంబర్ షిప్ తీసు కోవాలని కోరారు. జిల్లాకు బ్లడ్ బ్యాంక్ , జిల్లా కార్యాలయానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో త్వరలోనే స్థలం మంజూరు చేసుకుని భవన నిర్మాణం చేపట్టుకుందామని తెలిపారు. 2026 సంవత్సరపు థీమ్ "కీపింగ్ హుమానిటి అలైవ్" ను స్ఫూర్తిగా తీసుకొని అందరూ మానవత్వ విలువలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ , జిల్లా కమిటీ డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ , ప్రభాకర్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , జంపాల అంజయ్య , రాంబాయి , కార్యదర్శి క్రిస్టోఫర్ , డివిజన్ కమిటీ డైరెక్టర్ ఐలేని రామ్ రెడ్డి , లావణ్య , రెడ్ క్రాస్ సభ్యులు కరిపె నర్సింగ్ రావు , బందారు శ్రీనివాస్ , బిజ్జాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ప్రభుత్వం నిర్మాణం చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు శుక్రవారం మధిర నియోజకవర్గం వర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. బోనకల్ మండలం లక్ష్మీపురంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను తిరిగుతూ పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో భవనాల నమునా మ్యాప్ లను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్డు, విద్యుత్ సరఫరా ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గం ప్రజలకు ఎంతో మేలు చేకూర్చే విద్యా వ్యవస్థకు పోటీ ప్రపంచానికి పోటీ పడే విధంగా మన విద్యార్థులను తయారు చేసుకునేందుకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో ఉత్తమైన చదువు అందించే ఉద్దేశంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు విద్యను అందించేందుకు సమీకృత విద్యా సంస్థలను ఏర్పాటు చేసే సంకల్పానికి అధికారులు సమన్వయంతో పని చేసి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా పరిధి లో ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు అయి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యలో సమూలమైన విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వస్తాయని నిర్మాణంలో పేదపిల్లల బంగారు భవిష్యత్తుకు నాణ్యమైన నిర్మాణ పనులను పూర్తి చేసి సకాలంలో అందించేలాగ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. త్వరితగతిన వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి పిల్లలకు అందుబాటులో తీసుకురావాలని, నిర్ణిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని, పనుల పురోగతి వివరాలను ఎప్పటి కప్పుడు నివేదికలు అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, బోనకల్ మండల తహసీల్దారు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పోన్నంప్రభాకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

- జమ్మికుంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు





**జమ్మికుంట మే 8 (ప్రజావాణి):**హుస్నాబాద్ లో బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ అన్న జన్మదిన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన దేశిని కోటి ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుగురి సదయ్య కౌన్సిలర్ కు దాడి తిరుపతి మార్క్ డైరెక్టర్ సూర్య కాంగ్రెస్ నాయకులు పాత ప్రసాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు సజ్జు తదితరులు పాల్గొన్నారు


Printed, Published and Owned by **RAYINIPATLA KUMARASWAMY**, Printed at **RAMANI WEB OFFSET PRINTERS**, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : **RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS**, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. **RNI NO:TGTEL/25/A5443** Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతు వారము...

● పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు వారము" కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. శుక్రవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. చెరువుల అభివృద్ధి , చేప పిల్లల పంపిణీ , మత్స్య కారులకు ఆధునిక పరికరాల అందజేత , స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి పథకాలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. చేపల పెంపకం , మత్స్య సంపద అభివృద్ధి , రైతుల ఆదాయ వృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలపై అవగాహన కల్పించాలని అన్నారు.రైతులు,మత్స్యకారులు శాస్త్రీయ



పద్ధతులను అనుసరించి అధిక దిగు బడులు సాధించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు గ్రామ స్థాయిలో మరింత విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో మత్స్య శాఖ అధికారి రాజారామ్ , సైంటిస్ట్ నాగరాజు , కో-ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్టర్ వెంకట్రెడ్డి , మత్స్యకార సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# జల్లి మదీనా మసీదు కమిటీ ఏకగ్రీవం

● అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉద్యోగి ఎండి. అంకుష్ ఎన్నిక

● మసీదు అభివృద్ధికి బాటలు వేస్తామన్న నూతన కార్యవర్గం



**చెన్నారావుపేట మే 8 (ప్రజావాణి)** :మండల పరిధిలోని జల్లి గ్రామంలో ముస్లిం సోదరులు ఐకమత్య చాటుకున్నారు. గ్రామంలోని మదీనా జుమ్మా మసీదు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. ఎలాంటి పోటీ లేకుండా అందరి ఆమోదంతో కమిటీని ఎంపిక చేయడం విశేషం.?గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ ఎండి. హుస్సేన్, అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉద్యోగి ఎండి. అంకుష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎండి. యాకుబ్ పాషా (జీప్), ప్రధాన కార్యదర్శిగా ఎండి. యాకుబ్ పాషా (చికెన్ సెంటర్) బాధ్యతలు చేపట్టారు. అలాగే సహాయ కార్యదర్శిగా ఎండి. రఫీ, కోశాధికారిగా డాక్టర్ ఎండి. షర్ఫుద్దీన్ నియామకమయ్యారు. కార్యవర్గ సభ్యులుగా షాజహాన్, సాబీర్, హుస్సేన్, బాబు పాషా, రఫీ, అక్బర్, నజీరుద్దీన్‌లు ఎన్నికయ్యారు.?ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అంకుష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మసీదులో ఉన్న చిన్న చిన్న మరమ్మతులను వెంటనే పూర్తి చేస్తామని, భక్తుల సౌకర్యార్థం ఆవరణలో ఒక కొత్త గదిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గతంలో కూలిపోయి శిథిలావస్థలో ఉన్న పాత మసీదు స్థలాన్ని పునర్నిర్మించి, చుట్టూ రక్షణ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ నిర్ణయం పట్ల స్థానిక ముస్లిం సోదరులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలి...!

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.శుక్రవారం మధిర నియోజకవర్గం లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మధిర పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్.డి.ఆర్.ఎం. రూమ్, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, రేడియాలజీ బ్లాక్, ఓపి రూమ్ లను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారీ నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటు లో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తే ఎక్కువ మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసరపు సి-సెక్షన్ ఆపరేషన్ చేయవద్దని అన్నారు. ఎమర్జెన్సీ వార్డ్ లో కేసు షీట్ లను పరిశీలిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు రెగ్యులర్ గా అందుతున్న భోజనం నాణ్యత అంశాలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో





నిల్వ ఉంచాలని సూచించారు.ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.అంతకు ముందు మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా



వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆనతరం మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, ఐటిఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, విద్యశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో గోనె సంచుల గోల్‌మాల్!

**చెన్నారావుపేట మే 08 ప్రజావాణి :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో సుమారు 3,000 గోనె సంచులు మాయమవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటను పరిశీలించేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఎదుట రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో సీఈఓ చిట్టే రవి 10 వేల సంచులు ఉన్నాయని చెప్పగా, ఇన్చార్జ్ కట్టారెడ్డి మాత్రం కేవలం 7 వేలు మాత్రమే ఉన్నాయని పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో గంటల వ్యవధిలోనే 3,000 సంచులు ఎటు వెళ్లాయని, డబ్బులు తీసుకుని పక్కదారి పట్టించారా అని రైతులు అధికారులను నిలదీశారు. టోకెన్ల జారీలో పారదర్శకత లేదని, స్థానిక ఎమ్మెల్యే సొంత మండలంలోనే ఇలాంటి అక్రమాలు జరగడం దారుణమని మండిపడ్డారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

# పద్మావతి బేకరీలో రెవెన్యూ అధికారులు తనిఖీలు

● పట్టుబడ్డ అక్రమ సబ్సిడీ గ్యాస్

● సబ్సిడీ గ్యాస్ కు బ్లాక్లో బేకరీలకు హోటళ్లకు విక్రయిస్తున్న గ్యాస్ ఏజెన్సీ.



**మంతిని. మన ప్రజావాణి.** మంతినిలో ఈరోజు పద్మావతి బేకరీలో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ ఉపయోగిస్తున్నారని డివైఎఫ్ఐ నాయకులు గొర్రెశీకల సురేష్ మంతని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా స్పందించిన రెవెన్యూ అధికారులు పద్మావతి బేకరీలో తనిఖీ నిర్వహించారు తనిఖీల్లో అక్రమంగా వినియోగిస్తున్న అక్రమ సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ను పట్టుకున్నారు సామాన్య ప్రజలు గ్యాస్ కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న గాని అందని సబ్సిడీ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సిలిండర్లను 3000 వరకు చెల్లిస్తూ అక్రమంగా కొంటున్నారు సామాన్య ప్రజలపై భారం పడకుండా సబ్సిడీ గ్యాస్ ను సరైన సమయంలో ప్రజలకు అందించాలని అధిక ధరలకు అమ్ముతున్న గ్యాస్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని హోటళ్లకు బేకరీలకు విక్రయించకుండా తగు జాగ్రత్త పడాలని గొర్రింకల సురేష్ అన్నారు

# తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు

● జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్

● డాక్టర్ అన్నపూర్ణ.

**రాయపోల్ మే. 08( ప్రజావాణి ):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ కేంద్ర జిల్లా ఆసుపత్రి నందు ఈరోజు ప్రపంచ తలసేమియా దినోత్సవశీ (వరల్డ్ తలసేమియా -డే) సందర్భంగా తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ గారు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ హిమోగ్లోబిన్ తయారు చేసే కారణాలలో జన్యు మార్పుల వల్ల తలసేమియా వస్తుందని హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాలలో ఉండే ఒక ప్రోటీన్ ఇది శరీరం అంతా ఆక్సిజన్ అందిస్తుంది. జన్యు మార్పుల వల్ల మేనరికం వల్ల తల్లిదండ్రుల నుండి పిల్లలకు సంక్రమిస్తుంది హిమోగ్లోబిన్ అణువులు అల్ప మరియు బీట చైన్ అని పిలవబడే ప్రోటీన్ గోలుసుతో తయారు అవుతుందని అన్నారు హిమోగ్లోబిన్ ఉండే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి నిలిచిపోవడానికి తలసేమియా వ్యాధి అంటారని బిడ్డకు జన్మనిచ్చే వారి వల్ల ఈ ప్రాణాంతక వ్యాధి సక్రమిస్తుందన్నారు. జన్యు వాహకాలైన తల్లిదండ్రులకు తలసేమియా మైనర్ జన్మించే బిడ్డలు పాతిక శాతం మంది పుట్టుకతోనే వ్యాధి కేసులు అయ్యే



అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్.డాక్టర్ మీనా గారు మాట్లాడుతూ తల సేమియా అనేది పుట్టుకతో వచ్చే జన్యుపరమైన అసాధారణత హిమోగ్లోబిన్ మరియు ఎర్ర రక్త కణాల ఘనత ద్వారా వర్గీకరింపబడుతుందని తలసేమియా దీర్ఘకాలిక వ్యాధి దీనికి జీవిత కాలం పర్యవేక్షణ మరియు చికిత్స అవసరమన్నారు ఎముకల మజ్జ అనేది ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి చేసి ఎముకలకు కణజాలాలను సూచిస్తుంది ఎర్ర రక్త కణాలు మరియు తెల్ల రక్త కణాలు ప్లేట్లెట్స్ తల సేమియాలు ఎముకల మధ్య సరిపడా ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి తగ్గిస్తుంది ఫలితంగా రక్తహీనత ఏర్పడుతుం దన్నారు.తలసేమియా వల్ల పాలిపోయిన చర్మము, అసాధారణమైన వక్రబుద్ధి, నెమ్మదిగా ఎదుగుదల, బొడ్డువాపు, అంటువ్యాధుల బారిన పడతారని



కంటిలోని తెలుపు పసుపు వర్ణంగా మారుతుందని తల మరియు ముఖం యొక్క అసాధారణంగా వెడల్పుగా ఉండే ఎముకలు ఎముకలు మజ్జ ఎక్కువగా విస్తరించడం వల్ల సంభవిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎం. శ్రీనివాస్. జనరల్ మెడిసిన్ డాక్టర్ సుమన్ ఆర్ ఎం ఓస్ డాక్టర్ శ్రీధర్. డాక్టర్ ప్రణీత,హెడ్ నర్స్ ఉమా , రోజులిన్, ,నర్సింగ్ ఆఫీసర్స్ షబానా,సప్న, షాహిని, నజీర్ ,కవిత, ఉజ్మ, రేఖ, ఎక్రే టెక్నీషియన్ అయేషా మమత,హెడ్ నర్స్ రమేషు రచన జీవన సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి ,హెడ్ నర్సెస్ ఉమామహేశ్వరి వకుళాదేవి, నిర్మల పుష్ప , హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్ ఈసీజీ టెక్నీషియన్ రాజు, ఆరోగ్యశ్రీ సురేందర్ , సంతోష్ పారామెడికల్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమంలో చేసినారు.

# పాపయ్యపల్లి గ్రామంలోభక్తి శ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర

● హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

● సందర్భంగా రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి అంటూ హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు





**జమ్మికుంట మే 8 ప్రజావాణి** జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామంలో హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ శోభాయాత్రను గ్రామంలోనీ పురవీధులగుండ ఊరేగించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్రనునిర్వహించారు. శ్రీ అభయాంజనేయ ఉత్సవమూర్తికి వివిధ రకాల పూలతో ఘనంగా అలంకరించి వాహనంపై అధిరోహించారు. అనంతరం గ్రామంలోని పురవీధులగుండ స్వామివారిని ఊరేగించారు. హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు మహిళలు డప్పు చప్పుళ్ళు,మేళా తలాలతో కోలాట నృత్యలు చేస్తూ అంగరంగ వైభవంగా శోభయాత్రను నిర్వహించారు. గ్రామ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో హనుమాన్ రథయాత్రను అధ్యంతం తో రథయాత్రను తిలకించారు.గ్రామ ప్రజలు భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు గుండెకారి మధు,శంకర్, తోపాటు మాలాధారణ స్వాములు వజ్జపల్లి రాజు,కొల్లూరి రాకేష్,ఆరెపల్లి శివకృష్ణ,పవన్ కుమార్ మహేందర్, రాములు, సంతోష్,నరేష్,మనోహర్ స్వాములు పాల్గొన్నారు

# మంత్రి పొన్నం జన్మదిన వేడుకల్లో 'మెగా రక్తదాన శిబిరం'

**మన ప్రజావాణి ప్రతినిధి (చిగురుమామిడి):** రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. చిగురు మామిడి డిసిసి ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు రవీందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి సామాజిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ యువ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయుష్మాన్ బ్లడ్ బ్యాంకు వారు రక్తదాతల నుండి 35 యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛందంగా సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతూ, నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం, ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి గారు, మాజీ జెడ్పిటిసి ఉ డీసీసీ ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, డిసిసి కార్యదర్శి సాంబారిబాబు,మాజీ డి సి సి ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల రవీందర్, మాజీ జిల్లా అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, దాసరి ప్రవీణ్ కుమార్ , సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజు, సర్పంచులు గూల్ల రజిత-రాజు, కొంకట మౌనిక, అలువల శంకర్, కాటం సంపత్ రెడ్డి, కూతురు రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీనివాస్,సీనియర్ నాయకులు పూల లచ్చిరెడ్డి, దోమ శ్రీనివాస్ రెడ్డి, దోమ నరసింహ రెడ్డి, బోయిని వంశీ, బెజ్జంకి అంజయ్య, జిల్లెల్ల రమేష్, పూదరి వేణు, శిరవేణి సంపత్, పోటు మల్లా రెడ్డి, విష్ణమా ఛారి, దొబ్బల బాబు, గుజ్జుల రాజు, పిల్లి తిరుపతి, పెసరి శ్రీనివాస్, భగవాన్ ప్రసాద్, శ్రీమూర్తి రమేష్, కవ్వంపెల్లి సంజీవ్, గాదెపాక సునీల్ , మండల చొప్పదండి సాయి కుమార్, ముద్రవేణి కుమార్, సులుగురి సత్యనారాయణ రెడ్డి, బాలకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు,





# మాకనపల్లి గ్రామంలో కాశీబుగ్గ ఎస్ ఐ నరసింహమూర్తి

- కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్ఐ నరసింహ మూర్తి
- ప్రజలనుంచట్టలపై చైత్యన్యము చేస్తున్న కాశీబుగ్గ ఎస్ఐ



**పలాస ప్రజావాణి ప్రతినిధి :**పలాస మండలము మాకన పల్లి గ్రామాన్ని సందర్శించిన కాశీబుగ్గ ఎస్ఐ నరసింహ మూర్తి..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఐక్యంగా ఉంది కొత్త చట్టాలపై అవగాహన కోసము అందరూ కట్టుబడి ఉండాలని ఎస్ ఐ నరసింహమూర్తి కోరారు మాకన్నపల్లి గ్రామశీ సందర్శించి, గ్రామ జంక్షన్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, అదేవిధంగా గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వమని తెలియ జేయాలని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా మరియు అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయోగం, మొదలైన వాటి గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది గ్రామ ప్రజలు ఉన్నారు

# ఎమ్మెల్యే దాడికి బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు

- కరీంనగర్ లో శాంతిభద్రతలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడులు వాహనాల ధ్వంసం చేసిన బిజెపి నాయకులు



**జమ్మికుంట మే 8 ప్రజావాణి:**కరీంనగర్‌లో రోజురోజుకీ దిగజారుతున్న శాంతిభద్రతల పరిస్థితిపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద కల్వకుంట్ల సంజయ్ ముఠా గోపాల్ కాలేరు వెంకటేష్‌తో పాటు ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్ దాసోజు శ్రవణ్ కలిసి కలసి వినతిపత్రం సమర్పించారు ఇటీవల కరీంనగర్ నగరంలో వరుసగా జరుగుతున్న జ్యూవెలరీ షాపుల దొంగతనాలు, ప్రజలపై దాడులు, గుంపులుగా తిరుగుతూ భయాందోళనలు సృష్టిస్తున్న సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని నేతలు పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోందని వారు అభిప్రాయపడ్డారుప్రత్యేకంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడిని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఇది యాదృచ్ఛిక ఘటన కాదని రాజకీయ కక్షతో జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక బీజేపీ నాయకుల ప్రేరణ ఉన్నట్లు డీజీపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడులు వాహనాల ధ్వంసం ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని భయానక వాతావరణం సృష్టించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మండిపడ్డారు కరీంనగర్ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు శాంతిభద్రతలను పరిరక్షించడంలో విఫలమైన కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని విధుల్లో నిర్లక్ష్యం వహించిన టూ టౌన్ సీఐపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడికి బాధ్యులపై, అలాగే ఘటనకు ప్రేరేపించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారురాష్ట్రంలో ప్రజల ప్రాణాలు ఆస్తులకు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

- మంత్రి వివేక్ చేతుల మీదుగా అందుకున్న లబ్ధిదారులు



**మందమర్రి, (మన ప్రజావాణి)మే 8:**మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రోజు నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందమర్రి మండల, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు మంత్రి వివేక్ స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎమ్మార్వో సతీష్ శర్మ , ఎంపీడీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజలింగు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాధ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్,బండి సదానందం యాదవ్, మందమర్రి పట్టణ అధ్యక్షులు మంద తిరుమలరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో పార్కింగ్ కష్టాలు...

- వాహనదారులు సహకరిస్తేనే సమస్యకు పరిష్కారం.
- వాహనాల నిలిపివేతతో సమస్య.





**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 08:**భువనగిరి జిల్లా ఆసుపత్రికి వాహనాల పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. అస్తవ్యస్త పార్కింగ్తోనే అంబులెన్సల రాక పోకలకు కూడా ఇబ్బందిగా మారు తుందని ఆసుపత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్కింగ్ సమస్యను నియంత్రించేందుకు ఆసుపత్రి అధికారులు గతంలో చేసిన ప్రయత్నాలకు వాహనా దారుల సహాయ నిరాకరణ ఆటంకంగా మారింది.

రోజు వెయ్యి మందికి పైగా..

బోధనాసుపత్రిగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పనిదినాల్లో ఓపీ సేవలకు సుమారుగా 600 మందికిపైగా రోగులు వస్తుంటారు. ప్రమాదాలు అత్యవసర సేవల కోసం 50మంది వరకు , జిల్లా హోమియో ఆసుపత్రికి 50 మంది బాధితులు వస్తారు. డయాలసిస్ , డయాగ్నస్టిక్ హబ్ సేవలకు మరో వంద మందికి పైగా వస్తుంటారు. వైద్యులతో పాటు అన్ని స్థాయిల అధికారులు , సిబ్బంది వంద మందికి పైగా విధుల నిర్వహణకు హాజ రవుతుంటారు. ఇతర పనుల కోసం మరొక కొద్దిమంది వచ్చి పోతుంటారు. దీంతో రోజు వారిగా సుమారుగా వెయ్యి మంది వరకు ఆసుపత్రికి వచ్చి పోతుండగా వారి వెంట వచ్చే సహాయకులు అదనం వీరిలో సగానికి పైగా బైకులు లేదా సొంత వాహనాలలోనే ఆసుపత్రికి వస్తుంటారు. దీంతో ఆసుపత్రి ఆవరణలో ఉదయం నుంచి మధ్యాహ్నం ఓపీ సేవలు ముగిసే వరకు పార్కింగ్ ఇక్కట్లు ఏర్పడు తున్నాయి. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే వాహనాదారులు అస్తవ్యస్త పార్కింగ్తో కొన్ని సందర్భాల్లో నడపడానికి కూడా ఇరుకుగా మారుతున్న పరిస్థితి. పైగా అత్యవసర పరిస్థితుల్లో బాధితులను తరలించేందుకు అంబులెన్సకు కూడా దారి దొరకని పరిస్థితి నెలకొంటున్నది. రోడ్డు ప్రమాదాలు , అనుమానాస్పద మృత దేహాలను మార్చురిలో భద్రపరిచి పోస్టుమార్టం నిర్వహించే వరకు పెద్దసంఖ్య లో మృతుల బంధుమిత్రులు ఆసుపత్రికి వస్తుండడంతో వారి వాహనాలతో పార్కింగ్ ఇబ్బందులు మరింతగా పెరుగుతుంది.

జిల్లా ఆసుపత్రికి త్వరలో పెరగనున్న మరింత రద్దీ..

మూడో అంతస్తులో క్రిటికల్ వార్డు ఏర్పాటు కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే 50పడకల క్రిటికల్ వార్డు అందుబాటులోకి రానుంది. ఎమర్జెన్సీ వైద్య సేవలు అందించే క్రిటికల్ వార్డు అందుబాటులోకి వస్తే వాహనాల సంఖ్య కూడా పెరగనుంది. అలాగే క్లినికల్

పోస్టింగ్లకు వచ్చే వైద్య కళాశాల విద్యార్థుల సంఖ్య 200కు చేరనుంది. వీరిలో సొంత వాహనాలపైనే వచ్చేవి ద్యార్థులే అధికంగా ఉంటారు. మరిన్ని వైద్య సేవలు అందు బాటులోకి రానుండడంతో అంతే సంఖ్యలో వాహనాలు పెరిగి పార్కింగ్ సమస్య మరింత పెరుగుతుందని ఆసుపత్రి వర్గాలు అంటున్నారు.

అధికారుల ప్రయత్నాలు విఫలం..

ఓపీ సమయంలో తలెత్తే పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు గతంలో జిల్లా ఆసుపత్రి అధికారులు చేసిన ప్రయత్నాలు వాహనా దారుల సహాయ నిరాకరణతో విఫలమయ్యాయి. గతంలో అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీశైల చిన్న నాయక్ పా ర్కింగ్ సమస్య పరిష్కారానికి కోసం రోగుల , సిబ్బంది వాహనాలను మాత్రమే అనుమతిస్తూ ఆసుపత్రి గేటు వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించారు. రోగులను ఆసుపత్రిలో దించిన వెంటనే ఆటోలు , కార్లు తదితర వాహనాలు వెళ్లేలా చర్యలు కట్టుదిట్టం చేశారు. దీంతో కొద్దిరోజుల పాటు పార్కింగ్ ఇక్కట్లు తీరినప్పటికీ క్రమేపి వాహనాదారుల సహాయ నిరాకరణ , వాగ్వాదం పెరగడంతో మళ్లీ సమస్య యథావిధంగా మారింది. అయితే సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలేవి లేకపోవడంతో వానాదారుల ఆలోచన విధానంలో మార్పుతోనే పార్కింగ్ సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు అంటున్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరం





**రాయికల్;మే08 (ప్రజావాణి):**రాయికల్ మండల పశు వైద్యాధికారి, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఇటిక్యాల గ్రామంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం,ఫెర్టిలిటీ క్యాంప్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ నీరటి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగాపశు వైద్యాధికారి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరీక్షలు,అనారోగ్య పశువులకు చికిత్స,కృత్రిమ గర్భధారణ, గర్భధారణ(చూడి )పరీక్ష,గర్భశాయ సమస్యలు,సంతానోత్పత్తి చికిత్సలు,మేలుజాతి దూడల ప్రదర్శన,సబ్సిడీ గడ్డి విత్తనాల పంపిణీ,ఆడ దూడలు పుట్టే విధంగా సెక్స్ సార్టెడ్ సెమెన్,పశుగ్రాసాల సాగు, మరియు పశుపోషకులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ జిల్లా ఛైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి,ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి,పాడి రైతులు కొమ్ముల ఆదిరెడ్డి, ఏలేటి రవి,ఎల్లాల శేఖర్,బద్దం రమేష్,సురకంటి నాగిరెడ్డి,వంగ రాజు,ఏలేటి లింగారెడ్డి,ఎల్లాల రమేష్, ఏలేటి రాజిరెడ్డి,గుండ మల్లేష్,నీరటీ ప్రవీణ్,అరికొప్పుల లక్ష్మి ,బూరం పోశెట్టి,గరిపల్లి మల్లేష్, బుసనవేని గంగరాజం, కొక్కెర రాజు,కొక్కెర బుచన్న వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి






**రాయికల్;మే 08 (ప్రజావాణి):**బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రాయికల్ పోలీస్ స్టేషన్ లో ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీల నాయకులతో శాంతి సమావేశం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. కుర్బాన్ కార్యక్రమాలు గుర్తించిన ప్రదేశాల్లోనే నిర్వహించాలని,ఎవరూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదని స్పష్టం చేశారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని,చట్టాన్ని ఎవ్వరూ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలని కోరారు. అలాగే పనికిరాని, అపోహలు కలిగించే సమాచారాన్ని సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు. బెల్లాల్,బోర్నపల్లి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం సీఐ సుధాకర్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు బక్రీద్ సందర్భంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, మున్సిపల్ అందించే కవర్లను సక్రమంగా వినియోగించాలని ముస్లింలకు సూచించారు. వ్యర్థాలను సక్రమంగా డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచాలని కోరారు. తహసీల్దార్ నాగార్జున మాట్లాడుతూ సామరస్యంతో సమస్యలను పరిష్కరించుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్ ప్రజలు వ్యక్తిగత కక్షలు మానుకుని ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ మాట్లాడుతూ పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఏఈ నవీన్ విద్యుత్ సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సై సుధీర్ రావు గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా అందరూ కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు రాకేష్ నాయక్, కల్లెడ చిన్న ధర్మపురి,పుర్రె శ్రీధర్,పల్లికొండ గంగాధర్,హిందూ మరియు ముస్లిం మత పెద్దలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సేవలో 'హ్యాట్రిక్': వరుసగా మూడోసారి పెళ్లి కానుక అందజేసిన సర్పంచ్ సలీమా ఖాసీం

- ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా సర్పంచ్ సలీమా ఖాసీం



**ముదిగొండ మే 8 ప్రజావాణి**రాజకీయాల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో న్యూ లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ సలీమా ఖాసీం సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీని అక్షరాలా అమలు చేస్తూ, నిరుపేద కుటుంబాల్లోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. తాజాగా శుక్రవారం గ్రామానికి చెందిన తెరగొర్ల వాణి వివాహ సందర్భాన్ని పురస్కరించుకుని, సర్పంచ్ వరుసగా మూడోసారి పెళ్లి కానుకను అందజేసి తన సేవా హ్యాట్రిక్‌ను పూర్తి చేశారు. గత మార్చిలో కొట్టే శ్రీవాణి, మే నెల ఆరంభంలో పెరుమాళ్ళ దీప్తి వివాహాలకు సాయం అందించిన ఆమె, నేడు తెరగొర్ల వాణి వివాహానికి 50 కేజీల బియ్యం మరియు విలువైన చీరను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "పదవి అనేది ఒక బాధ్యత మాత్రమేనని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తనకు అసలైన సంతృప్తినిస్తుందని" పేర్కొన్నారు. సొంత నిధులతో వరుసగా మూడు కుటుంబాలకు అండగా నిలిచిన సర్పంచ్ సలీమా ఖాసీంపై ముదిగొండ మండల వ్యాప్తంగా, న్యూ లక్ష్మీపురం గ్రామస్తులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.


# ఘనంగా స్వాతంత్ర సమరయోధులు భాయ్ బాల్ ముకుంద్ వర్ధంతి

- మాజీ ఆర్మీ జవాన్ దంపతుల ఆధ్వర్యంలో



**మందమర్రి, (మన ప్రజావాణి)మే 8:**భారత స్వాతంత్ర్య సమరయోధులు భాయ్ బాల్ ముకుందా వర్ధంతిని మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ పివ్ హాల్, రాణి పివ్ హాల్ దంపతులు శుక్రవారం తమ నివాసంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. వారు ముకుంద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను నేటి యువతకు తెలియజేయాలని, మహనీయుల జయంతి, వర్ధంతి లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాయ్ బాల్ముకుంద్ 1889లో జీలం జిల్లాలోని (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) కరియాలా గ్రామంలో జన్మించారు. ప్రముఖ హిందూ అమరవీరుడు భాయ్ మతీ దాస్ కుటుంబానికి చెందిన విప్లవకారుడు. భాయ్ పర్మానంద్ సోదరుడు భాయ్ బాల్ముకుంద్ (1889 – 8 మే 1915) భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖ విప్లవకారుడు. ఆయన బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారు. 1912లో ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో లార్డ్ హార్డింగ్‌పై జరిగిన బాంబు దాడిలో (ఢిల్లీ కుట్ర కేసు) పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. గదర్ పార్టీ వ్యవస్థాపక సభ్యులతో కలిసి పనిచేశారు. బ్రిటీష్ ప్రభుత్వం ఢిల్లీ కుట్ర కేసులో ఆయన్ను దోషిగా తేల్చి,1915 మే 8న అంబాలా సెంట్రల్ జైలులో ఉరి తీయబడ్డ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన ఉరితీసిన ప్రదేశంలో (ఢిల్లీ గేట్, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్)అమరవీరుల స్మారకం నిర్మించబడింది. భాయ్ బాల్ముకుంద్ దేశ స్వాతంత్ర్యం కోసం పిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రాజు, రాజయ్య, ప్రభాకర్ లు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలోని ఊయలసేవ



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 8 (ప్రజావాణి)**లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (08.05.2026 ) సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాము లు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

# దొంగ ఎనికేపల్లి దేవాలయ అభివృద్ధిని సీఎం దృష్టికి తీసుకెళ్లిన -ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి..



**ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా పరిగి,మే 08:**పరిగి నియోజకవర్గం దోమ మండల పరిధిలోని దొంగ ఎనికేపల్లి గ్రామంలోని సంజీవయ్య స్వామి దేవాలయాన్ని రూ.2 కోట్లతో అంగరంగ వైభవంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం ద్వారా కోరడం జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి వివరించగా,ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితో ప్రాంతీయ భక్తులకు మరింత సౌకర్యాలు కలగనున్నాయని పేర్కొన్నారు.

# భువనేశ్వర్ కుమార్ అరుదైన రికార్డ్

ఐపీఎల్ అంటేనే రికార్డుల అడ్డా. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు  సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్‌లో ఒక మెమరబుల్ మైలురాయిని చేరుకున్నాడు. గురువారం లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ బరిలోకి దిగడమే ఒక రికార్డుగా మారింది. ఐపీఎల్ హిస్టరీలో ఇప్పటివరకు ఏ ఫాస్ట్ బౌలర్ కూడా 200 మ్యాచ్‌లు ఆడలేదు. ఆ ఘనత సాధించిన ఫస్ట్ ఇండియన్ పేసర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్ లో 200 పైగా వికెట్లు తీసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ కూడా అతనే కావడం విశేషం. ఈ అరుదైన రికార్డుపై భువనేశ్వర్ కుమార్ స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. ఏ మైలురాయి అయినా స్పెషలే అని, కానీ 200 మ్యాచ్‌లు ఆడటం అనేది నిజంగా ఒక బిగ్ అచీవ్‌మెంట్ అని ఆనందం వ్యక్తం చేశాడు. అందుకే చాలా గర్వంగా, హ్యాపీగా ఉందని, ముఖ్యంగా గతేడాది కప్పు గెలిచిన జట్టులో ఉంటూ, ఈ సీజన్ లో కూడా అద్భుతంగా రాణిస్తున్న సమయంలో ఈ రికార్డ్ రావడం ఇంకాస్త స్పెషల్ ఫీలింగ్ ఇస్తోందని పేర్కొన్నాడు. తన కెరీర్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటన్నిటిలో ఒకదాన్ని ఎంచుకోవడం కష్టమే కానీ, ఇన్నేళ్ల ప్రయాణంలో తన తొలి వికెట్ మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపాడు. అక్కడి నుండే ఈ జర్నీ మొదలైందని భువీ తన మనసులోని మాటను చెప్పాడు. ప్రస్తుత కాలంలో టీ20 ఫార్మాట్ చాలా వేగంగా మారిపోతోంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతున్నారు. దీనిపై భువనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాటర్ల అప్రోచ్ పూర్తిగా మారిపోయిందని, పవర్‌ప్లేలో వాళ్ళు చాలా అగ్రెసివ్‌గా ఆడుతున్నారని విశ్లేషించాడు. ఇలాంటి కండిషన్స్‌లో బౌలర్లు నిరంతరం తమ గేమ్ ను ఇంప్రూవ్ చేసుకోవడం ఒక పెద్ద




ఛాలెంజ్ అని, కానీ తాను మాత్రం ఎప్పుడూ తన బేసిక్స్‌ను బలంగా ఉంచుకోవడానికే ట్రై చేస్తానని, అదే తనను ఇన్ని ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా ముందుకు నడిపిస్తోందని వివరించాడు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే భువనేశ్వర్ ఈ మ్యాచ్‌లో వికెట్ తీయలేక పోయాడు. నాలుగు ఓవర్లలో 34 పరుగులు ఇచ్చాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ ఇంజూరీ సమస్యలతో సతమతమవుతోంది. జోష్ ఇంగ్లిస్, మొహ్సిన్ ఖాన్, ఆవేష్ ఖాన్ వంటి కీలక ప్లేయర్లు ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అర్షిన్ కులకర్ణి, మయాంక్ యాదవ్, షాబాజ్ అహ్మద్ టీమ్ లోకి వచ్చారు. భారత క్రికెట్ లో భువనేశ్వర్ కుమార్ ఒక సైలెంట్ వారియర్ లాంటివాడని, ఎన్ని కొత్త టెక్నాలజీలు వచ్చినా, ఎంతమంది కొత్త బౌలర్లు వచ్చినా భువీ తన స్వింగ్ తో బ్యాటర్లను వణికించగలడని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. 200 మ్యాచ్‌ల ఈ మైలురాయి అతని హార్డ్ వర్క్ కు నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

# టీమిండియాలోకి వైభవ్ ఎంట్రీ?

భారత క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ పరుగుల వరద పారిస్తున్న ఈ టీనేజ్ సెన్సేషన్ గురించి టీమిండియా వెటరన్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ కేవలం టీ20లకే పరిమితం కాకుండా టెస్టు క్రికెట్ కూడా ఆడాలని, అప్పుడే ఒక ఆటగాడిగా పరిపూర్ణత వస్తుందని పుజారా అభిప్రాయపడ్డారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వంటి అతిపెద్ద లీగ్‌లో వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 404 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భవిష్యత్తు టీమ్ ఇండియా స్టార్‌గా అవతరించాడు. వైభవ్ పెర్ఫార్మెన్స్ చూసి అతడిని వెంటనే టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే పుజారా మాత్రం వైభవ్ టెస్టు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారు. "వైభవ్ టీ20ల్లో అద్భుతంగా ఆడుతున్నాడు, అతడికి త్వరలోనే టీమిండియా పిలుపు వస్తుంది. కానీ టెస్టు క్రికెట్ అనేది ప్రతి యువ ఆటగాడి మనసులో ఉండాలి. ఒక ఆటగాడికి గౌరవం, పట్టుదల, టెక్నిక్ అనేవి టెస్టుల నుంచే వస్తాయి. సామర్థ్యం ఉంటే వైభవ్ కచ్చితంగా టెస్టుల్లో కూడా రాణించాలి" అని పుజారా పేర్కొన్నారు. టెస్టు క్రికెట్ గొప్పదే అయినప్పటికీ.. వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) నిపుణులకు కూడా తమదైన ప్రాముఖ్యత ఉంటుందని పుజారా చెప్పారు. శ్రేయస్ అయ్యర్, వైభవ్ వంటి ఆటగాళ్లను వారి బలాబలాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు ఆటగాళ్లను ఎంపిక చేసే విధానాన్ని ఆయన




సమర్థించారు. దీనివల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఆయా ఫార్మాట్లలో జట్టు మరింత బలంగా తయారవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జియోస్టార్ సిటివి హిందీ ఫీడ్ నిపుణుడిగా తన కొత్త పాత్ర గురించి కూడా పుజారా ముచ్చటించారు. టీవీలో మ్యాచ్ విశ్లేషణ చేయడం ద్వారా అభిమానులకు ఆటలోని లోటుపాట్లను వివరించవచ్చని ఆయన చెప్పారు. ఆటగాడిగా తనకున్న అనుభవం ద్వారా ఫీల్డ్‌లో జరిగే పరిస్థితులు, టెక్నిక్, బౌలింగ్ వ్యూహాలను విడమర్చి చెప్పడం వల్ల కుర్రాళ్లకు కూడా ఆటపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఒక ఆటగాడు ఒక షాట్‌ను ఎలా ఆడాడు లేదా బౌలర్ ఏ యాంగిల్ వాడుతున్నాడు వంటి విషయాలు ప్రేక్షకులకు తెలియజేయడం తనకు సంతోషంగా ఉందన్నారు.

# పూర్తిగా మారిపోనున్న ఐపీఎల్ షెడ్యూల్..




ఐపీఎల్ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్... ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్ ఐపీఎల్ భవిష్యత్తులో మరిన్ని మెరుపులు మెరిపించబోతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ అభిమానులను అలరిస్తుండగానే, బీసీసీఐ ( రాబోయే సీజన్ల కోసం ఒక భారీ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. ఇకపై ఐపీఎల్ అంటే కేవలం రెండు నెలల సందడి మాత్రమే కాదు.. అంతకు మించి ఉండబోతోంది. ముఖ్యంగా మ్యాచ్‌ల సంఖ్య విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా లీగ్ భవిష్యత్తుపై ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాబోయే మీడియా రైట్స్ సైకిల్ (2028 నుంచి) కోసం టోర్నమెంట్ ఫార్మాట్‌లో పెద్ద మార్పులు చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. ప్రస్తుతం ఒక సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు జరుగుతుండగా, 2028 నుంచి ఈ సంఖ్యను ఏకంగా 94కి పెంచబోతున్నారు. దీనివల్ల ఆటగాళ్లకు సవాలు పెరగడమే కాకుండా, ప్రేక్షకులకు మరిన్ని ఉత్సాహభరితమైన పోరాటాలు చూసే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక టీమ్ లీగ్ స్టేజ్‌లో 14 మ్యాచ్‌లు ఆడుతోంది. అయితే 2028 నుంచి ఈ సంఖ్య 18కి చేరనుంది. అంటే టోర్నమెంట్ మరికొన్ని రోజులు అదనంగా జరుగుతుంది. పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్ కోసం జరిగే యుద్ధం ఇప్పుడు మరింత రసవత్తరంగా మారనుంది. మ్యాచ్‌ల సంఖ్య పెరగడం వల్ల ఆటగాళ్ల ఫిట్‌నెస్, జట్ల వ్యూహాలు కూడా మారే అవకాశం ఉంది. మ్యాచ్‌లు పెరుగుతున్నాయి కదా అని కొత్త టీమ్స్ వస్తాయని భావిస్తే పొరపాటే. ఐపీఎల్‌లో ప్రస్తుతానికి ఉన్న 10 జట్లే కొనసాగుతాయని అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు. కొత్త జట్లను ఇప్పుడే చేర్చడం సరైన నిర్ణయం కాదని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే ఉన్న 10 జట్ల మధ్యే మ్యాచ్‌ల సంఖ్యను పెంచి లీగ్‌ను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు. దీనివల్ల నాణ్యమైన క్రికెట్ ప్రేక్షకులకు అందుతుందని బోర్డు ఆశిస్తోంది.మ్యాచ్‌ల సంఖ్యను 94కి పెంచడం వెనుక అసలు కారణం హోమ్ అండ్ అవే ఫార్మాట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయడమే. అంటే ప్రతి జట్టు మరో జట్టుతో రెండుసార్లు తలపడుతుంది. ఒక మ్యాచ్ తన సొంత మైదానంలో  ఆడితే, రెండో మ్యాచ్ ప్రత్యర్థి జట్టు మైదానంలో  ఆడుతుంది. దీనివల్ల అన్ని జట్లకు సమానమైన అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం గ్రూప్ సిస్టమ్ వల్ల కొన్ని జట్లతో ఒకే మ్యాచ్ ఆడే పరిస్థితి ఉంది, కానీ 2028 నుంచి ఈ లోపం తొలగిపోనుంది.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ హెచ్చరిక

ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న క్రికెట్ లీగ్ ఐపీఎల్‌లో ఇప్పుడు ఒక కొత్త చర్చ మొదలైంది. గ్రౌండ్‌లో ఆట కంటే కూడా ఆటగాళ్ల క్రమశిక్షణ పైనే ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో జరిగిన కొన్ని సంఘటనలు బీసీసీఐని ఆలోచనలో పడేశాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేయడం నుంచి డగౌట్‌లో ఫోన్లు వాడటం వరకు రకరకాల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు ఇప్పుడు చాలా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకుంది. దీనికోసం అన్ని ఫ్రాంచైజీలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లెటర్ పంపింది. ఈ లేఖలో అన్నిటికంటే ముఖ్యమైంది హనీ ట్రాప్ వార్నింగ్. ఐపీఎల్ టోర్నీ జరుగుతున్నప్పుడు ప్లేయర్స్ టార్గెట్‌గా హనీ ట్రాప్స్ జరిగే అవకాశం ఉందని బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. కొంతమంది ప్లేయర్స్ టీమ్ మేనేజర్లకు చెప్పకుండా హోటల్ రూమ్స్‌కు అనధికారిక వ్యక్తులను రానిస్తున్నట్లు బోర్డు దృష్టికి వచ్చింది. ఇది సెక్యూరిటీ పరంగా చాలా ప్రమాదకరమని, అందుకే ఇకపై ఎవరైనా గెస్ట్ రావాలి అంటే ఖచ్చితంగా గెస్ట్ అప్రూవల్ సిస్టమ్ ద్వారానే రావాలి అని బోర్డు రూల్ పెట్టింది. గెస్టుల వివరాలను



ప్రతిరోజు రికార్డు చేయాలి అని టీమ్ మేనేజర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తున్న వీడియో అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా లేఖలో ప్రస్తావించారు. డ్రెస్సింగ్ రూమ్స్‌లో, డగౌట్స్‌లో లేదా టీమ్ హోటల్స్‌లో వేప్స్, ఈ సిగరెట్లు వాడటంపై పూర్తిస్థాయిలో నిషేధం విధించారు. భారత చట్టాల ప్రకారం కూడా ఇది నేరమని, ఎవరైనా నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని బోర్డు హెచ్చరించింది. క్రమశిక్షణ అనేది టీమ్ గౌరవానికి సంబంధించిన విషయమని, దీనిని అశ్రద్ధ చేయకూడదని స్పష్టం చేసింది.కేవలం ఆటగాళ్లకు మాత్రమే కాదు, టీమ్ యజమానులకు కూడా బీసీసీఐ కొన్ని ఆదేశాలు ఇచ్చింది. మ్యాచ్ లైవ్‌లో జరుగుతున్నప్పుడు యజమానులు ప్లేయర్స్ దగ్గరకు వెళ్లడం, వారిని హగ్ చేసుకోవడం లేదా ఫిజికల్?గా ఇంటరాక్ట్ అవ్వడం వంటివి చేయకూడదు అని బోర్డు కోరింది. ఇలాంటి పనులు టీమ్ పరిస్థితులను దెబ్బతీస్తాయని సైకియా తన లేఖలో పేర్కొన్నారు. ప్లేయర్స్, మ్యాచ్ అఫీషియల్స్ ఉండే ఏరియా ప్రోటోకాల్స్?ను యజమానులు ఖచ్చితంగా పాటించాలి అని, ఆటగాళ్లకు డిస్టర్బెన్స్ కలిగించకూడదు అని లేఖలో వివరించారు. చాలామంది ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ సెక్యూరిటీ ఆఫీసర్లకు చెప్పకుండా హోటల్ నుంచి బయటకు వెళ్తున్నట్లు బీసీసీఐ గమనించింది. ఇలా ఇష్టం వచ్చిన టైమ్‌లో హోటల్ దాటి బయటకు వెళ్లడంపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి టీమ్ హోటల్ వదిలి వెళ్లే ప్రతిసారి మూవ్‌మెంట్ లాగ్‌లో ఎంట్రీ ఇవ్వాలి అని చెప్పింది. సెక్యూరిటీ లియాజన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్?కు ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా ఎక్కడికి వెళ్లకూడదు అని రూల్ పెట్టింది. ఇది ప్లేయర్స్ సేఫ్టీకి చాలా ముఖ్యమని బోర్డు భావిస్తోంది.

# భారత క్రికెట్ జట్టులోకి సపోర్టింగ్ స్టాఫ్

భారత క్రికెట్ జట్టు సపోర్టింగ్ స్టాఫ్ లో కీలక మార్పులు చోటు చేసుకోన్నాయి. స్పిన్ బౌలింగ్ కోసం ప్రత్యేకంగా ఓ కోచ్‌ను నియమించాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పట్టుబట్టాడు. ఈ మేరకు బీసీసీఐకి సిఫార్సు సైతం చేశారు. ఈ పదవికి టీమిండియా మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే పేరును ప్రతిపాదించారు కూడా. బీసీసీఐ ఆమోదం లభిస్తే టీమిండియాలో ప్రత్యేక స్పిన్ కోచ్‌ను నియమించడం ఇదే మొదటిసారి అవుతుంది. ప్రస్తుతం జట్టు సపోర్టింగ్ స్టాఫ్ లో మోర్నే మోర్కెల్ బౌలింగ్ కోచ్‌గా, సితాంశు కోటక్ బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. స్పిన్ బౌలింగ్‌కు ప్రత్యేకంగా కోచ్ అంటూ ఎవరూ లేరు. ఈ లోటును పూరించాలని గౌతమ్ గంభీర్ కోరుకుంటున్నారు. గత కొంతకాలంగా భారత స్పిన్నర్ల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఇదే గంభీర్ ప్రధాన ఆందోళన. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన స్పిన్ దళమైన భారత్.. ఇటీవల సొంతగడ్డపైనే ఇబ్బందులు పడుతోంది. 2024లో న్యూజిలాండ్ భారత్‌ను స్వదేశీ టెస్ట్ సిరీస్‌లో ఓడించి చరిత్ర సృష్టించడమే దీనికి నిదర్శనం. గత ఏడాది భారత్‌లో టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. సైమన్ హార్మర్, కేశవ్ మహారాజ్ వంటి విదేశీ స్పిన్నర్లు మన పిచ్‌లపై మెరుగైన ప్రభావం చూపారు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిల ఫామ్ ప్రశ్నార్థకమైంది. ఈ అంశాలన్నీ జట్టు యాజమాన్యాన్ని పునరాలోచింపజేశాయి. సాయిరాజ్ బహుతులే టీమిండియా మాజీ లెగ్ స్పిన్నర్. ఆయన రెండు టెస్టులు, ఎనిమిది వన్డే ఇంటర్నేషనల్ ఆడారు. టెస్టుల్లో 39 పరుగులు చేసి 3 వికెట్లు, వన్డేల్లో 23 పరుగులుచేసి 2 వికెట్లు సాధించారు. అంతర్జాతీయ కెరీర్ స్వల్పకాలమే అయినా, దేశవాళీ క్రికెట్‌లో ఆయన రికార్డు అద్భుతం. కోచింగ్ పైనా మంచి పట్టు ఉంది. బీసీసీఐ నేషనల్ క్రికెట్ అకాడమీలో కొనసాగుతున్నారు.

# టీమిండియా టీ20 జట్టులో నాయకత్వ మార్పు!?




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జాతీయ టీ20 జట్టులో కీలక నాయకత్వ మార్పుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో 2026 టీ20 ప్రపంచకప్ టైటిల్ టీమ్‌ఇండియా గెలిచినా.. తాజాగా ఐపీఎల్‌లో తాను ఫామ్ కోల్పోవడం వల్ల అతడ్ని ఆ బాధ్యతల నుంచి తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సీనియర్ ఆటగాడు ఇటీవల బ్యాటింగ్‌లో విఫలమవుతుండటంతో సెలక్షన్ కమిటీ ఆందోళన చెందుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, సూర్యకుమార్ ఇటీవల పరుగులు చేయకపోవడంతో అతడ్ని పక్కకి పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం అందుతోంది. అతడి స్థానంలో టీ20 జట్టుకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 తర్వాత జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు అతడిని కెప్టెన్‌గా చేసే అవకాశం కూడా ఉంది. మరోవైపు సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ.. వ్యక్తిగత ప్రదర్శన క్షీణించింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున పది మ్యాచ్‌లలో అతను కేవలం 195 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అదే విధంగా ఈ టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ మణికట్టు సమస్యతో బాధపడుతున్నట్లు.. అసౌకర్యంగా బ్యాటింగ్ చేస్తున్నట్లు నివేదికలు తెలిపాయి. ఈ క్రమంలో శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లో ఉండడం సహా కెప్టెన్‌గానూ రాణిస్తుండడం వల్ల అతడ్ని టీ20 జట్టులోకి తీసుకొనే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.



# పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే నటరాజన్‌ను పక్కన పెట్టాం

### - ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ వెల్లడి

పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే తమ పేసర్ టీ నటరాజన్‌ను పక్కనపెట్టాల్సి వచ్చిందని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఢిల్లీ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. రెండు మార్పులతో ఈ మ్యాచ్ ఆడుతున్నామని టాస్ సందర్భంగా అక్షర్ పటేల్ తెలిపాడు. ఢిల్లీ వికెట్ స్లోగా ఉంటుందని స్పిన్నర్లు, పేసర్లకు సమంగా సహకరిస్తుందని చెప్పాడు. దాంతోనే ముగ్గురు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నామని, ఈ క్రమంలోనే నటరాజన్‌ను పక్కనపెట్టాల్సి వచ్చిందని అక్షర్ పటేల్ వెల్లడించాడు. 'ముందుగా బ్యాటింగ్ చేయడం, బౌలింగ్ చేయడం అనేది మన చేతుల్లో లేని పని. కాబట్టి జట్టుగా ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా అందుకు సిద్దంగా ఉండాలి. తొలి బంతి నుంచే అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. మేం రెండు మార్పులతో బరిలోకి దిగుతున్నాం. నటరాజన్ స్థానంలో ముఖేష్ కుమార్ బరిలోకి దిగుతున్నాడు. విప్రజ్ నిగమ్ కూడా జట్టులోకి వచ్చాడు. నా అనుభవం ప్రకారం ఢిల్లీ వికెట్‌పై బంతి అంతగా టర్న్ అవ్వదు. కానీ పిచ్ స్లోగా ఉంటుంది. బంతి చాలా నెమ్మదిగా బ్యాట్‌పైకి వస్తుంది. ఇది స్పిన్నర్లకు అనుకూలంగా మారుతుంది. పేసర్లకు స్లోయర్, బౌన్సర్లు వేస్తే అడ్వాంటేజ్ లభిస్తుంది.

# సతీలీలావతితో ఏంచెప్పాలనుకున్నారో..?

## రొటీన్ కథతో బోరింగ్ సినిమా



దాదాపు పదిహేనేళ్ళ క్రితం 'అందాల రాక్షసి' తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఉత్తరాఖండ్ బ్యూటీ లావణ్య త్రిపాఠి ఇవాళ తెలుగువారింటి కోడలు. కథానాయకుడు వరుణ్ తేజ్ తో ఆమె వివాహం 2023లో అయ్యింది. పెళ్ళికి ముందు లావణ్య త్రిపాఠి ఉమెన్ సెంట్రిక్ మూవీ 'హ్యాపీ బర్త్ డే' చేసింది. పెళ్ళి తర్వాత మరోసారి అదే తరహాలో 'సతీ లీలావతి' సినిమాలో టైటిల్ రోల్ ప్లే చేసింది. అప్పట్లో 'హ్యాపీ బర్త్ డే' ఆమెకు చేదు అనుభవాన్ని అందించింది. మరి ఇప్పుడు 'సతీ లీలావతి' ఎలాంటి అనుభవాన్ని అందించిందో చూద్దాం. చిన్నప్పటి నుండి తల్లిదండ్రులు (పవిత్ర లోకేష్, నరేశ్) చీటికీమాటికి కీచులాడుకోవడంతో చిన్నారి లీల (లావణ్య త్రిపాఠి) మానసికంగా బాగా డిస్టర్బ్ అవుతుంది. పెరిగి పెద్దయ్యాక సైకియాట్రిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) ఆమెలో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుతాడు. సేతులోని గుడ్ క్వాలిటీస్ నచ్చి అతన్నే ఆమె పెళ్ళాడుతుంది. సేతు కారణంగా ఆమె మూడేళ్ళలో స్టార్ డైరెక్టర్ గా ఎదుగుతుంది. అక్కడ నుంచే ఆమె కష్టాలు మొదలవుతాయి. భార్య షూటింగ్స్ బిజీలో తనను పట్టించుకోక పోవడంతో సేతు డిప్రెషన్ కు లోనవుతాడు. ఆ సమయంలో నర్స్ నికోలా సెబాస్టియన్ (మడోన్నా సబాస్టియన్) కు దగ్గరవుతాడు. భార్యకు విడాకులిచ్చి... నికోలాను పెళ్ళి చేసుకోవాలని సేతు అనుకుంటాడు. ఆ విషయాన్ని లీలకు చెప్పినప్పుడు ఆమె ఎలా రియాక్ట్ అయ్యింది? ప్రేమించి మరి పెళ్ళి చేసుకున్న భర్త దూరం అవుతాడని తెలిసి ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఈ ప్రేమజంట విడిపోయిందా? తప్పులు దిద్దుకుని జీవితాన్ని కొనసాగించిందా? దానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ? అనేదే ఈ సినిమా కథ. చిన్న చిన్న కారణాల వల్ల భార్య భర్తలు విడిపోవడం చూస్తున్నాం. ఈ కథలోనూ అలాంటి సిల్లీ రీజనే దర్శకుడు తీసుకున్నాడు. భార్య దర్శకురాలని తెలిసి, ఆమె తనకు తగినంత సమయం ఇవ్వలేదని గుర్తించి, అదీ సైకాలజిస్ట్ అయిన ఓ వ్యక్తి అదే కారణంతో ఆమెకు విడాకులు ఇవ్వాలను కోవడం సిల్లీగా అనిపిస్తుంది. విడాకులు తీసుకోబోతున్న ప్రేమజంట అనేది ఈ మూవీలోని బేసిక్ పాయింట్! అందుకు కారణంగా చూపించిన పాయింట్ చాలా బలహీనంగా ఉండటంతో ఆ తర్వాత వచ్చే ఏ సన్నివేశాలతోనూ ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని పరిస్థితి నెలకొంది. భార్యాభర్తలు ఎలాంటి అభిప్రాయభేదాలు ఉన్నా కలిసి కాపురం చేయాలంటూ లీల తల్లిదండ్రులనే దర్శకుడు ఉదాహరణగా చూపుతాడు. ఈ పాయింట్ ఎన్నో సినిమాలలో చూపించిందే! అందులో కొత్తదనం లేదు. భార్యను అపార్థం చేసుకుని దూరం అవ్వాలనుకున్న భర్త తిరిగి తప్పు తెలుసుకుని భార్యకు దగ్గరయ్యే కథలు కోకొల్లలుగా వచ్చాయి. కాకుంటే ఇందులో హీరోయిన్ డైరెక్టర్. ఆమె ప్రొఫెషన్ ను బేస్ చేసుకుని కొన్ని కామెడీ సీన్ ను దర్శకుడు తాతినేని సత్య తెరకెక్కించాడు. కానీ ఆ సన్నివేశాలు పేలవంగా ఉండి, ప్రేక్షకుడి సహనాన్ని పరీక్షించాయి. దాంతో సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ ఏదో కంగాళీగా సాగినట్టే అనిపిస్తుంది. నటీనటుల విషయానికి వస్తే లావణ్య త్రిపాఠి తెరమీద అందంగా ఉంది. కథానుగుణంగా యాక్షన్ సీన్స్ కూడా చేసింది. కాకపోతే సెంటిమెంట్ సీన్స్ పండించలేకపోయింది.

# పల్లెటూరు ప్రేమకథ.. 'గోదారి గట్టుపైన'




మేం ఫేమస్ చిత్రంతో యూత్ ఆడియెన్స్‌కు చేరువైన సుమంత్ ప్రభాస్, సుదీర్ఘ విరామం తర్వాత నటించిన తాజా చిత్రం 'గోదారి గట్టుపైన'. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే గోదావరి తీర ప్రాంత నేపథ్యంలో, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాల మధ్య దర్శకుడు సుభాష్ చంద్ర ఈ చిత్రంను తెరకెక్కించారు. కోనసీమలోని ఓ మారుమూల గ్రామంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే శ్యామ్ బాబు (జగపతిబాబు)కు తన కూతురు మాయ (నిధి ప్రదీప్) అంటే ప్రాణం. ఆమె సంతోషమే తన ప్రపంచంగా బ్రతుకుతుంటాడు. అయితే, మాయ జీవితంలోకి ఆటో డ్రైవర్ రాజు (సుమంత్ ప్రభాస్) ప్రవేశించడంతో కథ మలుపు తిరుగుతుంది. వీరిద్దరి మధ్య చిగురించిన ప్రేమ, భిన్నమైన సామాజిక నేపథ్యాల కారణంగా తండ్రీకూతుళ్ల మధ్య ఎలాంటి సంఘర్షణకు దారితీసింది? చివరకు ప్రేమ గెలిచిందా లేక తండ్రి బాధ్యత గెలిచిందా? అనేదే ఈ చిత్ర ప్రధానాంశం. తెలంగాణ యాసకు అలవాటు పడిన సుమంత్, ఈ సినిమాలో గోదావరి యాసను ఎంతో సహజంగా పలికించి ఆశ్చర్యపరిచారు. ఆటో డ్రైవర్

పాత్రలో ఆయన నటన పరిణతి చెందింది. కూతురి భవిష్యత్తు కోసం ఆరాటపడే సగటు తండ్రి పాత్రలో జగపతిబాబు మరోసారి తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. సినిమాకు ఆయనే ప్రధాన బలం. తొలి సినిమా అయినప్పటికీ, భావోద్వేగపూరితమైన సన్నివేశాల్లో నిధి చక్కటి ప్రతిభ కనబరిచారు. నెల్లూరు సుదర్శన్ మార్క్ కామెడీ సినిమాకు పెద్ద ఎసెట్. బోరింగ్ సీన్స్‌లో కూడా తన పంచ్‌లతో థియేటర్‌లో నవ్వులు పూయించారు. దర్శకుడు సుభాష్ చంద్ర పాత కథనే తీసుకున్నప్పటికీ, దానికి భావోద్వేగాలను అద్ది తెరకెక్కించిన తీరు బాగుంది. సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ గోదావరి అందాలను, ప్లలెటూరి వాతావరణాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించింది. నాగవంశీ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాలను ఎలివేట్ చేయడంలో సక్సెస్ అయింది. సినిమా ప్రథమార్థం ప్రేమకథ మరియు కామెడీతో సరదాగా సాగిపోతుంది. సెకండాఫ్ పూర్తిగా ఎమోషన్స్ మీద ఆధారపడింది. కొన్ని చోట్ల కథ నెమ్మదించినట్లు అనిపించినా, క్లైమాక్స్ వైపు వెళ్లేకొద్దీ తండ్రీకూతుళ్ల బంధం ప్రేక్షకులను కదిలిస్తుంది. 'అమ్మ బాగుంటేనే ఇల్లు బాగుంటుంది', 'అతను ఫ్యాక్టరీకి కాదు.. కుటుంబానికి సెక్యూరిటీ గార్డ్' వంటి సంభాషణలు మనసును హత్తుకుంటాయి. మొత్తానికి 'గోదారి గట్టుపైన' ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సాగే ఒక స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రం. వేసవి సెలవుల్లో కుటుంబంతో కలిసి చూడదగ్గ ఒక పాజిటివ్ ఫ్యామిలీ డ్రామాగా దీనిని అభివర్ణించవచ్చు.

# బాలయ్యతో జత కట్టనున్న బాలీవుడ్ బ్యూటీ

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేనిల కాంబినేషన్‌లో రాబోతున్న చచీదీఖ111 సినిమా గురించి వస్తున్న ఈ లేటెస్ట్ అప్‌డేట్ నందమూరి అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఈ చిత్రంలో బాలయ్యతో బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫఖ్రీ జతకట్టనున్నట్టు సమాచారం. మరోవైపు, 'వీరసింహారెడ్డి' వంటి మాస్ హిట్టు తర్వాత బాలయ్య, గోపీచంద్ వీరిద్దరూ కలుస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. గతంలో గోపీచంద్ మలినేని సినిమాల్లోని ఐటెం సాంగ్స్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో మనకు తెలిసిందే. ఈసారి ఆ జోరును మరింత పెంచేందుకు బాలీవుడ్ నటి నర్గీస్ ఫఖ్రీని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. 'రాక్ స్టార్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నర్గీస్, బాలయ్య ఎనర్జీకి తోడైతే స్క్రీన్ పై గ్లామర్ అండ్ మాస్ విజువల్స్ అదిరిపోతాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఒక స్టూడియోలో ఈ పాట కోసం చిత్ర బృందం ఒక భారీ సెట్‌ను నిర్మించింది. సమాచారం ప్రకారం, ఈ పాట షూటింగ్ ఈ రోజు (మే 8) నుంచే ప్రారంభం కానుంది. తమన్ అదిరిపోయే మాస్ ట్యూన్ ఇచ్చారని, బాలయ్య తనదైన సిగ్నేచర్ స్టెప్పులతో రచ్చ చేయబోతున్నారని టాక్. గోపీచంద్ మలినేని కూడా బాలయ్యను పక్కా మాస్ యాక్షన్ అవతారంలో చూపించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.







# రామ్ చరణ్ 'పెద్ది' సెట్స్ పై చిరంజీవి సందడి...!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యువ దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా సెట్స్‌పై తాజాగా మెగాస్టార్ చిరంజీవి సందడి చేశారు. ఈ విషయాన్ని దర్శకుడు బుచ్చిబాబు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిరంజీవి సెట్‌ను సందర్శించినప్పటి వీడియోను ఆయన షేర్ చేశారు.

ఈ సందర్భంగా బుచ్చిబాబు ఓ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. చిరంజీవిని ఉద్దేశిస్తూ, "పెద్ది సెట్స్‌లో బాస్ మరియు నా గురువు. ఇది నా జీవితంలో అత్యుత్తమ జ్ఞాపకాలలో ఒకటి. అవును.. 'పెద్ది' స్ఫూర్తితో నేను కూడా కొంచెం కండలు పెంచాను" అని పేర్కొన్నారు. తన అభిమాన హీరో, గురువు సెట్‌కు రావడంతో బుచ్చిబాబు ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, చిరంజీవితో పాటు దర్శకుడు సుకుమార్ కూడా 'పెద్ది' సెట్స్ ను సందర్శించారు.

రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# నేను చనిపోలేదు.. ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నా: శక్తి కపూర్



ప్రముఖ బాలీవుడ్ నటుడు శక్తి కపూర్ (73) తన మరణంపై సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వదంతులను తీవ్రంగా ఖండించారు. తాను ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నానని స్పష్టం చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ తప్పుడు ప్రచారంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. "అందరికీ నమస్కారం. నా మరణం గురించి వస్తున్న వార్తలన్నీ అబద్ధం. నేను ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాను. దయచేసి ఆ వార్తలను పట్టించుకోవద్దు" అని శక్తి కపూర్ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తాను సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నానని, ఇలాంటివి చేయడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఈ వీడియో చూసిన ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెట్టారు. కాగా, నాలుగు దశాబ్దాల సినీ కెరీర్‌లో శక్తి కపూర్ ప్రతినాయకుడిగా, హాస్యనటుడిగా సుమారు 700 చిత్రాలలో నటించి తనదైన ముద్ర వేశారు. 'రాజా బాబు', 'అందాజ్ అప్నా అప్నా', 'హంగామా', 'మాలామాల్ వీక్లీ' వంటి

# ఎన్నారై మోసం కేసు..

## నటి అషురెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ



పెళ్లి పేరుతో ఎన్నారై వ్యాపారవేత్తను మోసం చేశారన్న ఆరోపణలపై నమోదైన క్రిమినల్ కేసులో సినీ నటి అషురెడ్డికి (వెంకట అశ్వినిరెడ్డి) తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపైనా, తన తల్లి యశోదరెడ్డిపైనా నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని, దర్యాప్తును నిలిపివేయాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కఠిన చర్యలు తీసుకోకుండా మినహాయింపు ఇవ్వాలన్న అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ కేసుపై గురువారం జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పోలీసులు తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశారని, దర్యాప్తును నిలిపివేయాలని అషురెడ్డి తరఫు న్యాయవాది కోరారు. అయితే, ప్రభుత్వ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కేసు నమోదుకు తగిన ఆధారాలున్నాయని తెలిపారు. సుమారు రూ.10.5 కోట్ల నగదు బదిలీ ఆన్‌లైన్‌లోనే జరిగిందని, దర్యాప్తు కొనసాగించాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఇప్పటికే పిటిషనర్‌కు 41ఏ నోటీసులు జారీ చేశామని కూడా పేర్కొన్నారు.

లండన్‌లో ఉంటున్న తన కుమారుడు వై.వి.ధర్మేంద్రను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషురెడ్డి, ఆమె తల్లి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి మోసం చేశారంటూ హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వై. సత్యనారాయణమూర్తి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేశారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com